# పెన్ పవర్

12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు

విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టి. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 13 సంచిక : 21 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం శనివారం 26 సెప్టెంబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :13 ISSUE :21 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM SAT 26 SEPTEMBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


## గంగమ్మ ఒడికి ఖైరతాబాద్ మహాగణపతి..

### ప్రశాంతంగా ముగిసిన నిమజ్జనం





- హుస్సేన్‌సాగర్‌లో ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనం పూర్తి
- 69 అడుగుల పంచముఖ గణపతిగా దర్శనమిచ్చిన విగ్రహం
- క్రేన్ నంబర్ 4 వద్ద మధ్యాహ్నం 2.15 గంటలకు నిమజ్జనం
- పటిష్ఠ బందోబస్తు నడుమ ప్రశాంతంగా ముగిసిన వేడుక

హైదరాబాద్‌లోని అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జన వేడుకలు శుక్రవారం ప్రశాంతంగా ముగిశాయి. ఈ ఏడాది 69 అడుగుల ఎత్తుతో 'పంచముఖ సంకటహర మహాగణపతి'గా భక్తులకు దర్శనమిచ్చిన స్వామివారి విగ్రహాన్ని వేలాది మంది భక్తుల జయజయధ్వానాల మధ్య హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనం చేశారు.

- మిగతా 2లో





### బడా గణేశ్ శోభాయాత్ర: పోలీసులతో కలిసి స్టెప్పులేసిన దానం నాగేందర్

- ఖైరతాబాద్ గణేశ్ శోభాయాత్రలో డ్యాన్స్ చేసిన దానం నాగేందర్
- మహిళా కానిస్టేబుళ్లతో కలిసి స్టెప్పులేసిన వైనం
- 'ప్యారడైజ్' సినిమా పాటకు డ్యాన్స్ చేసి ఉత్సాహం పంచారు
- సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియో
- బడా గణేశ్ నిమజ్జన వేడుకల్లో చోటుచేసుకున్న ఘటన





### పెట్టుబడులే లక్ష్యంగా మంత్రి లోకేశ్

## అహ్మదాబాద్ పర్యటన

- టోరెంట్, వెల్ స్పన్, ఆస్టల్.. అహ్మదాబాద్‌లో రెండో రోజు కూడా నారా లోకేశ్ బిజీబిజీ
- అహ్మదాబాద్ పర్యటనలో పారిశ్రామిక దిగ్గజాలతో మంత్రి లోకేశ్ వరుస సమావేశాలు
- క్లీన్ ఎనర్జీ ప్రాజెక్టుల కోసం ఏపీని ఎంచుకోవాలని టోరెంట్ గ్రూప్‌కు పిలుపు
- విశాఖలో టైర్ల తయారీ, డేటా సెంటర్ల ఏర్పాటుపై పలు సంస్థలతో కీలక చర్చలు
- కాకినాడ, నెల్లూరులలో ఇండస్ట్రియల్ పార్కులు, రిఫైనరీలు స్థాపించాలని విజ్ఞప్తి
- లోకేశ్ ప్రతిపాదనలను పరిశీలిస్తామని సానుకూలంగా స్పందించిన కంపెనీలు

పెన్ పవర్ డెస్క్:ఏపీకి పెట్టుబడులే లక్ష్యంగా ఏపీ ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ విస్తృత పర్యటనలు కొనసాగిస్తున్నారు. గుజరాత్ లోని అహ్మదాబాద్ టూర్‌లో భాగంగా రెండో రోజైన శుక్రవారం ఆయన పలు పారిశ్రామిక దిగ్గజాలతో సమావేశమయ్యారు. రాష్ట్రానికి భారీ పెట్టుబడులను ఆకర్షించడమే ధ్యేయంగా ఏడు ప్రముఖ సంస్థల అధిపతులు, ప్రతినిధులతో చర్చలు జరిపారు. క్లీన్ ఎనర్జీ, ఫార్మా, టెక్స్‌టైల్స్, మౌలిక సదుపాయాలు, డేటా సెంటర్లు,

- మిగతా 2లో

### ఏపీ హోంగార్డులకు శుభవార్త.. కానిస్టేబుల్

## ఉద్యోగాల్లో 10 శాతం రిజర్వేషన్

- ఏపీలోని హోంగార్డులకు ప్రభుత్వం శుభవార్త
- కానిస్టేబుల్ డ్రైవర్ పోస్టుల నియామకాల్లో 10 శాతం రిజర్వేషన్
- ప్రభుత్వ పాత ఉత్తర్వులను సవరిస్తూ కొత్త జీవో జారీ
- పోలీస్ రవాణా విభాగంలో 198 పోస్టుల భర్తీకి రంగం సిద్ధం

- మిగతా 2లో




### ఏపీలో వర్ష బీభత్సం.. అధికారులకు మంత్రి

## అచ్చెన్నాయుడు కీలక ఆదేశాలు

- తీవ్ర వాయుగుండం వల్ల రాష్ట్రంలో పంట నష్టంపై తక్షణ అంచనాకు ఆదేశం
- పునరుద్ధరణ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని అధికారులకు సూచన
- ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో మంత్రి అచ్చెన్నాయుడు టెలీకాన్ఫరెన్స్
- పొలాల్లోని నీటిని తొలగిస్తూనే, భవిష్యత్తు కోసం నిల్వ చేయాలని దిశానిర్దేశం
- రైతులకు సాంకేతిక సలహాలు అందించి అండగా నిలవాలని స్పష్టం



పెన్ పవర్ డెస్క్:తీవ్ర వాయుగుండం ప్రభావంతో రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలు, ఈదురుగాలుల వల్ల జరిగిన పంట నష్టాన్ని తక్షణమే అంచనా వేయాలని అధికారులను ఆదేశించినట్టు ఏపీ వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. దెబ్బతిన్న రహదారులు, ఇతర మౌలిక సదుపాయాల పునరుద్ధరణ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని స్పష్టం చేసినట్టు ఆయన వెల్లడించారు.

- మిగతా 2లో

### మహిళలను పారిశ్రామికవేత్తలుగా

## తీర్చిదిద్దడమే లక్ష్యం

- విజయవాడలో తొలిసారి నేషనల్ సరస్ ప్రదర్శన
- ఏర్పాట్లను పరిశీలించిన కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్
- మహిళా సంఘాల ఉత్పత్తులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మార్కెట్ సౌకర్యం కల్పించడమే లక్ష్యమని వ్యాఖ్య

పెన్ పవర్ డెస్క్:మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడం, వారి ఆర్థిక సాధికారతను పెంపొందించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ స్పష్టం చేశారు. విజయవాడలో తొలిసారిగా నిర్వహిస్తున్న 'నేషనల్



- మిగతా 2లో

### ఎన్నికల సంఘంలో విభేదాలు అంటూ కథనం..

## ఆందోళన వ్యక్తం చేసిన జగన్

- ప్రస్తుత నియామక చట్టాన్ని సవరించాలని కేంద్రానికి డిమాండ్
- ప్రధాని, ప్రతిపక్ష నేతతో పాటు సీజేఐ కూడా కమిటీలో ఉండాలన్న జగన్
- ఈసీలో కమిషనర్ల అభ్యంతరాలపై ప్రజలకు స్పష్టత ఇవ్వాలని సూచన
- ఏపీలో గతంలో తమ అభ్యంతరాలను పట్టించుకోలేదని ఆరోపణ

పెన్ పవర్ డెస్క్:కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ)లో అంతర్గత విభేదాలు ఉన్నట్టు జాతీయ మీడియాలో కథనం రావడం, దేశవ్యాప్తంగా ప్రకంపనలు రేగడంపై వైసీపీ అధినేత, ఏపీ మాజీ సీఎం జగన్ స్పందించారు.

- మిగతా 2లో



## సీఈసీ రాజీనామాకు డిమాండ్.. దేశవ్యాప్తంగా నిరసనలు..




### ఓట్ల దొంగలను వదిలిపెట్టమంటూ నినాదాలు

పెన్ పవర్ డెస్క్:కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కార్యదర్శి జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. కాంగ్రెస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రజలు రోడ్లపైకి వచ్చి నిరసన వ్యక్తం చేశారు. ఓట్ల దొంగ, దేశద్రోహి,

- మిగతా 2లో

## స్టాలిన్ గారూ, ఈ కేసుపై నోరు విప్పండి



### సీఎం విజయ్ ఆగ్రహం

- వీరమణి లైంగిక వేధింపుల కేసుపై నోరు విప్పాలన్న విజయ్
- డీఎంకే హయాంలోనే కేసును తొక్కిపెట్టారని తీవ్ర ఆరోపణలు
- ఈ విషయంలో డీఎంకే, ఏఐఏడీఎంకే కుమ్మక్కయ్యాయని విమర్శ
- ఉప ఎన్నికల ప్రచారంలో స్టాలిన్ ప్రభుత్వాన్ని టార్గెట్ చేసిన సీఎం విజయ్

- మిగతా 2లో

## 'బ్రహ్మోస్'తో పాకిస్థాన్‌కు నిద్రలేని రాత్రులు

పెన్ పవర్ డెస్క్: ఉత్తర్‌ప్రదేశ్‌లో తయారవుతున్న బ్రహ్మోస్ క్షిపణులతో దాయాది పాకిస్థాన్ నిద్రలేని రాత్రులు గడుపుతోందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. అమేఠీలో తయారవుతున్న ఏకే-203 రైఫిళ్లు మావోయిస్టులు, ఉగ్రవాదులను బెంబేలెత్తిస్తున్నాయని వ్యాఖ్యానించారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా చేపట్టిన ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్ ప్రయోగించిన బ్రహ్మోస్ క్షిపణులు శత్రు స్థావరాలను



- మిగతా 2లో

## సీజేపీ చీఫ్ అభిజిత్ దీప్కేకు.. ఢిల్లీ హైకోర్టు నోటీసులు

పెన్ పవర్ డెస్క్:జంతర్ మంతర్ నిరసనల్లో ఓ మహిళ ఫొటోల ప్రదర్శనపై ఢిల్లీ హైకోర్టు సీజేపీ ప్రతినిధులకు ఢిల్లీ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. సీజేపీ చీఫ్ అభిజిత్ దీప్కే తోపాటు సౌరభ్ దాస్, అశుతోష్ రాంకా,




- మిగతా 2లో




## ఎన్నికల సంఘంలో విభేదాలు అంటూ కథనం..
# ఆందోళన వ్యక్తం చేసిన జగన్

- మొదటి పేజి తరువాయి

ఈసీ పనితీరు, నియామకాల పద్ధతిపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికల సంఘం వంటి రాజ్యాంగబద్ధ సంస్థలపై ప్రజలకు సంపూర్ణ విశ్వాసం ఉన్నప్పుడే ప్రజాస్వామ్యం నిలబడుతుందని అభిప్రాయపడ్డారు. ఈ మేరకు శుక్రవారం ఆయన సోషల్ మీడియా వేదికగా ఒక సుదీర్ఘ పోస్ట్ చేశారు. ఎన్నికల కమిషనర్ల నియామకం కోసం ఉద్దేశించిన 'చీఫ్ ఎలక్షన్ కమిషనర్ అండ్ అదర్ ఎలక్షన్ కమిషనర్స్ యాక్ట్, 2023'ను పునఃసమీక్షించి, సవరించాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇటీవల జాతీయ మీడియాలో వచ్చిన కథనాలను జగన్ తన పోస్టులో ప్రస్తావించారు. ఎన్నికల సంఘం తీసుకున్న పలు నిర్ణయాలు, ఓటర్ల జాబితాల రూపకల్పన, ఈసీఐనెట్ నిర్వహణ వంటి అంశాలపై ఇద్దరు ఎన్నికల కమిషనర్లు అభ్యంతరాలు వ్యక్తం చేశారన్న వార్తలు ప్రజల్లో తీవ్రమైన ప్రశ్నలు, సందేహాలకు తావిస్తున్నాయని పేర్కొన్నారు. ఆరోపణలు, ప్రత్యారోపణల కంటే.. ఏయే అంశాలపై అభ్యంతరాలు నమోదయ్యాయి, వాటిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు, ఓటర్ల జాబితాలో పేర్ల చేర్పులు, తొలగింపులు, పునరుద్ధరణ ప్రక్రియ ఎంత పారదర్శకంగా జరిగిందనే దానిపై ప్రజలకు స్పష్టత అవసరమని జగన్ నొక్కిచెప్పారు. ఈ విషయాలపై ప్రజలకు నమ్మకం కలిగించే చర్యలు తక్షణమే చేపట్టాలని సూచించారు. ఈ నేపథ్యంలో, గతంలో తాము కూడా మద్దతు ఇచ్చిన 2023 నాటి ఎన్నికల కమిషనర్ల నియామక చట్టాన్ని ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా పునఃసమీక్షించాల్సిన అవసరం ఉందని జగన్ పేర్కొన్నారు. ఈ భయాలను తొలగించి, సాధారణ పరిస్థితులను నెలకొల్పేందుకు కేంద్ర ప్రభుత్వమే ముందుకు రావాలని కోరారు. ప్రధానమంత్రి, లోక్‌సభలో ప్రతిపక్ష నేత, భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)లతో కూడిన త్రిసభ్య కమిటీ ద్వారానే ఎన్నికల కమిషనర్లను నియమించే పాత విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. "పరీక్ష రాసే విద్యార్థే, తన ఎగ్జామినర్ ను నియమించుకుంటే, ఆ అధికారి ఎంత నిజాయతీపరుడైనా ఆరోపణలకు ఆస్కారం ఉంటుంది. ఆ స్థానంలో ఒక తటస్థ వ్యక్తి ఉంటేనే మేలు" అని జగన్ ఉదహరించారు. ఈ మార్పు ఎన్నికల సంఘంపై ప్రజల గౌరవాన్ని, విశ్వాసాన్ని కచ్చితంగా పునరుద్ధరిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లో తమ పార్టీ ఎదుర్కొన్న అనుభవాలను కూడా జగన్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఏపీలో ఎస్ఐఆర్ (ాxజ) ప్రక్రియ సమయంలో అధికార పార్టీ తన అధికారాన్ని దుర్వినియోగం చేసిందని, అనేక సందర్భాల్లో తమ విజ్ఞప్తులను పట్టించుకోలేదని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలోనూ డివిజన్ల పునర్విభజన తీరుపై ప్రతిపక్షంగా తాము లేవనెత్తిన అభ్యంతరాలను పక్కన పెట్టేశారని అన్నారు. ఇలాంటి చర్యలు ఎన్నికల ప్రక్రియపై ప్రజా విశ్వాసాన్ని బలహీనపరుస్తాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండటమే కాదు, అవి ఉన్నట్టుగా కనిపించాలని, వాటిని కాపాడటమే రాజ్యాంగ సంస్థల ప్రాథమిక విధి అని జగన్ తన పోస్టులో స్పష్టం చేశారు.

ఈ వార్త మీకు నచ్చిందా?.. నచ్చిన వార్తలను మీ మిత్రు

# సీఈసీ రాజీనామాకు డిమాండ్..
# దేశవ్యాప్తంగా నిరసనలు..

- మొదటి పేజి తరువాయి

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన జ్ఞానేష్ కుమార్ ను తక్షణమే పదవినుంచి తొలగించాలని, అరెస్ట్ చేసి జైల్లో పెట్టాలని డిమాండ్ చేశారు. పరస్పర ప్రయోజనాలకోసం ప్రధాని మోదీ, సీఈసీ జ్ఞానేష్ కుమార్ తో కుమ్మక్కై ఎన్నికల వ్యవస్థను భ్రష్టు పట్టించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓట్ల దొంగలను వదిలిపెట్టే ప్రసక్తే లేదని శపథం చేశారు.

**యూపీ, లక్నోలో..**

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ యూపీ రాజధాని లక్నోలో కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున నిరసనలకు దిగారు. ఓట్ల దొంగతనానికి పాల్పడి జ్ఞానేష్ దేశద్రోహానికి పాల్పడ్డారు..ఎన్నికల కమిషనర్ పదవిలో కొనసాగే అర్హత ఆయనకు లేదు. ఓట్లను దొంగిలించి ప్రజాస్వామ్యంపై ప్రత్యక్ష దాడి చేశారు, ఇది క్షమించరాని నేరమని ఆయన తక్షణమే పదవి నుండి తొలగించి, అరెస్టు చేయాలని నిరసనకారులు నినాదాలు చేశారు.

**పశ్చిమ బెంగాల్ లో..**

దేశ ద్రోహుల చేతినుంచి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని, ఎలక్షన్ సిస్టమ్ లో జవాబుదారీతనం కావాలని పశ్చిమ బెంగాల్ లో పెద్ద ఎత్తున కాంగ్రెస్ కార్యకర్తలు రోడ్లపైకి వచ్చి నిరసనలు వ్యక్తం చేశారు. భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రధాని మోదీ, సీఈసీ జ్ఞానేష్ కుమార్ కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని, ఆయనను అరెస్టును డిమాండ్ చేశారు. క్విడ్ ప్రో కో (పరస్పర ప్రయోజనం) కోసం పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో జ్ఞానేష్ కీలక పాత్ర పోషించారని దుయ్యబట్టారు. అందుకే జ్ఞానేష్ కుమార్ కు పద్మ భూషణ్ పురస్కారం ఇవ్వాలని బీజేపీ వర్గాలు ఇప్పుడు డిమాండ్ చేస్తున్నాయని విమర్శించారు. బీజేపీ, సీఈసీ వీరంతా ఓట్ల దొంగల ముఠా అని నినాదాలు చేశారు.

**పంజాబ్ లో..**

ప్రజాస్వామ్యంలో ఓట్లను దొంగిలించడం దేశద్రోహమే అవుతుంది.. ఈ పనికి పాల్పడిన సీఈసీ జ్ఞానేష్ కుమార్ వెంటనే రిజైన్ చేయాలని , అయనను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ పంజాబ్ లో ఆందోళనలు జరిగాయి. రాజ్ బ్రార్ నాయకత్వంలో పంజాబ్ కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలిపారు. దీక్షా, –జజుజల నిరంకుశ పోకడను సవాల్ చేశారు.

**హర్యానాలో..**

ఓట్ల చోరీలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని వెంటనే జ్ఞానేష్ కుమార్ అరెస్ట్ చేయాలని హర్యానా కాంగ్రెస్ నేతృత్వంలో పెద్ద ఎత్తున నిరసనలు వెల్లువెత్తాయి. ప్రజల హక్కులపై దాడి చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఇక జ్ఞానేష్ కుమార్ ప్రధాని మోదీ కూడా కాపాడలేరని స్పష్టం చేశారు కాంగ్రెస్ నేతలు. ఈ నిరసనల్లో భారీ సంఖ్యలో కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు. భారీ ర్యాలీగా వస్తున్న కార్యకర్తలను బారీకేడ్లు పెట్టి పోలీసులు అడ్డుకున్నారు. నిరసనకారులపై వాటర్ క్యానన్లు ప్రయోగించారు.

**బిహార్ లో..**

సీఈసీ జ్ఞానేష్ కుమార్ ప్రజల తీర్పును అపహాస్యం చేస్తూ దేశద్రోహానికి పాల్పడ్డారని, వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ బీహార్ రాష్ట్ర వ్యాప్తంగా రాష్ట్ర కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసనలు వెల్లువెత్తాయి. నిరసనల్లో పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొని మోదీ, జ్ఞానేష్ కుమార్ కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

**మణిపూర్ లో..**

సీఈసీ జ్ఞానేష్ కుమార్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున నిరసనలు తలెత్తాయి. జ్ఞానేష్ కుమార్ ను పదవి నుంచితొలగించి అరెస్ట్ చేయాలని ఓక్రమ్ ఇబోబి సింగ్ నేతృత్వంలోని మణిపూర్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆందోళనలు చేపట్టింది. ప్రజాస్వామ్యాన్ని ఖూని చేసిన దేశ ద్రోహికి కఠిన శిక్ష పడేవరకు నిరసనలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

**ఒడిశాలో..**

సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా, అరెస్ట్ ను డిమాండ్ చేస్తూ ఒడిశాలో కూడా నిరసనలు వెల్లువెత్తాయి. ఎన్నికల వ్యవస్థలో జవాబుదారి తనం కోరుతూ ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రజలు రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలిపారు. రాజ్యాంగం చేతబట్టుకొని ప్రధానిమోదీ, జ్ఞానేష్ కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తే ఆందోళన వ్యక్తం చేశారు.

**సిమ్లా, హిమాచల్ ప్రదేశ్ లో..**

సీఈసీ జ్ఞానేష్ కుమార్ ఓట్లను చోరీ చేసి దేశ ద్రోహానికి పాల్పడ్డారు. ఇది ఎప్పటికీ క్షమించరాని నేరం. జ్ఞానేష్ కుమార్ తన పదవికి రాజీనామా చేయాలి. అతడిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ హిమాచల్ ప్రదేశ్ రాజధాని సిమ్లాలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు జరిగాయి. యువత, మహిళలు నిరసనల్లో పాల్గొని ప్రధాని మోదీ, జ్ఞానేష్ కుమార్ కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ ఇంఛార్జ్, అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం సమక్షంలో పెద్ద ఎత్తున కార్యకర్తలు నిరసనల్లో పాల్గొన్నారు.

**ఉత్తరాఖండ్ లో..**

సీఈసీ రాజీనామాను డిమాండ్ చేస్తూ ఉత్తరాఖండ్ లో కూడా నిరసనలు వెల్లువెత్తాయి. ఉత్తరాఖంవడ్ ఇన్‌ఛార్జ్ జనరల్ సెక్రటరీ కుమారి సెల్జా జీ, రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ గోడియాల్ జీ , జుశ్రూ నేతల యశ్పాల్ ఆర్య జీ సమక్షంలో పెద్ద ఎత్తున కాంగ్రెస్ కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. ఓట్లను దొంగిలించి జ్ఞానేష్ కుమార్ దేశద్రోహానికి పాల్పడ్డారని వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

**జమ్మూ కాశ్మీర్ లో..**

సీఈసీ జ్ఞానేష్ కుమార్ కు వ్యతిరేకంగా జమ్మూ కాశ్మీర్ లో పెద్ద ఎత్తున నిరసనలు వెల్లువెత్తాయి. జ్ఞానేష్ కుమార్ ను పదవినుంచి తొలగించాలని, అరెస్ట్ చేయాలని, ఓట్ల దొంగతనం చేసినందుకు గాను కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు.

# గంగమ్మ ఒడికి ఖైరతాబాద్ మహాగణపతి...

ఉదయం 9.30 గంటలకు ఖైరతాబాద్ నుంచి మహాగణపతి శోభాయాత్ర వైభవంగా ప్రారంభమైంది. యాత్ర ప్రారంభంలో దానం నాగేందర్ గణనాథుడి ఎదుట డ్యాన్స్ చేసి అందరిలో ఉత్సాహాన్ని నింపారు. 'గణపతి బప్పా మోరియా' అంటూ భక్తులు చేసిన నినాదాలతో పరిసర ప్రాంతాలన్నీ మార్మోగాయి. ఈ శోభాయాత్ర సెన్సేషన్ థియేటర్, రాజ్‌దూత్ చౌరస్తా, టెలిఫోన్ భవన్, ఇక్బాల్ మినార్, తెలంగాణ తల్లి చౌరస్తా మీదుగా ఎన్టీఆర్ మార్గ్‌కు చేరుకుంది. ఎన్టీఆర్ మార్గ్‌లో ఏర్పాటు చేసిన క్రేన్ నంబర్ 4 వద్దకు విగ్రహాన్ని చేర్చిన అనంతరం, ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 2.15 గంటలకు భారీ క్రేన్ల సహాయంతో విగ్రహాన్ని సాగరంలో నిమజ్జనం చేశారు. తమ ఆరాధ్య దైవమైన గణనాథుడికి భక్తులు అశ్రునయనాలతో ఘనంగా వీడ్కోలు పలికారు. పోలీసు యంత్రాంగం పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నిమజ్జన ప్రక్రియ విజయవంతంగా పూర్తయింది.

**బడా గణేశ్ శోభాయాత్ర: పోలీసులతో కలిసి స్టెప్పులేసిన దానం నాగేందర్**

హైదరాబాద్‌లోని ప్రఖ్యాత ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జన శోభాయాత్ర వైభవంగా సాగుతోంది. ఈ వేడుకల్లో భాగంగా దానం నాగేందర్ ఉత్సాహంగా నృత్యం చేసి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. శుక్రవారం వైభవంగా సాగుతున్న శోభాయాత్రలో ఈ ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. బందోబస్తు విధుల్లో ఉన్న కొందరు మహిళా కానిస్టేబుళ్లతో కలిసి దానం నాగేందర్ నృత్యం చేశారు. ఇటీవల విడుదలైన 'ప్యారడైజ్' చిత్రంలోని ఒక పాటకు ఆయన ఉత్సాహంగా స్టెప్పులు వేసి వేడుకల్లో జోష్ నింపారు. పండుగ వాతావరణంలో ఆయన చేసిన ఈ నృత్యం అక్కడ ఉన్న భక్తులను, చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దానం నాగేందర్ నృత్యంపై నెటిజన్లు విభిన్న రీతుల్లో స్పందిస్తున్నారు. కొందరు ఆయనలోని ఉత్సాహాన్ని ప్రశంసిస్తుండగా, మరికొందరు ఈ అంశంపై రాజకీయ కోణంలో వ్యాఖ్యలు చేస్తున్నారు.

## ఏపీలో వర్ష బీభత్సం.. అధికారులకు మంత్రి
# అచ్చెన్నాయుడు కీలక ఆదేశాలు

- మొదటి పేజి తరువాయి

క్షేత్రస్థాయిలో రైతులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ మేరకు ఆయన ఉన్నతాధికారులతో శుక్రవారం ప్రత్యేక టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బూడితి రాజశేఖర్, ఇతర ఉన్నతాధికారులతో పాటు పార్వతీపురం మన్యం, డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ, శ్రీకాకుళం జిల్లాల కలెక్టర్లతో మాట్లాడారు. వ్యవసాయ, ఉద్యాన పంటలకు జరిగిన నష్టంపై వెంటనే క్షేత్రస్థాయి సర్వే ప్రారంభించి, వివరాల నమోదును వేగవంతం చేయాలని ఆదేశించారు. పొలాల్లో నిలిచిన నీటిని తొలగించడం, అధిక తేమ వల్ల పంటలు దెబ్బతినకుండా రైతులకు అవసరమైన సాంకేతిక సలహాలు అందించి, వారిలో అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజల రాకపోకలకు ఆటంకం కలగకుండా దెబ్బతిన్న ముఖ్యమైన రహదారులకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని కలెక్టర్లను ఆదేశించారు. జిల్లా యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉంటూ పరిస్థితులను సమీక్షించాలని స్పష్టం చేశారు.

అదే సమయంలో, ప్రస్తుతం కురుస్తున్న వర్షపు నీటిని సాధ్యమైనంత మేర సంరక్షించుకోవాలని మంత్రి సూచించారు. పంటలకు హాని కలిగించే చోట నీటిని తొలగిస్తూనే, చెరువులు, జలాశయాలు, ఇతర నీటి వనరుల్లో నీటిని నిల్వ చేసి భవిష్యత్తు సాగు, తాగునీటి అవసరాలకు వినియోగించుకునేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, మత్స్య శాఖలు సమన్వయంతో పనిచేస్తూ రైతులకు, ప్రజలకు నిరంతర సహాయం అందించాలని అచ్చెన్నాయుడు ఆదేశించారు.

# స్టాలిన్ గారూ, ఈ కేసుపై నోరు విప్పండి

తమిళనాడు రాజకీయాలు మరోసారి రసవత్తరంగా మారాయి. ప్రముఖ గ్రానైట్ వ్యాపారి ఆర్. వీరమణిపై నమోదైన లైంగిక వేధింపుల కేసు విషయంలో ముఖ్యమంత్రి విజయ్, డీఎంకే అధినేత ఎం.కే. స్టాలిన్‌పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "స్టాలిన్ గారూ, ఈ ఉదంతంపై మీ మౌనాన్ని వీడండి" అంటూ డిమాండ్ చేశారు. అక్టోబర్ 6న జరగనున్న ఉప ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న విజయ్, డీఎంకే ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. "2025 అక్టోబర్‌లో, డీఎంకే హయాంలోనే ఈ కేసుకు సంబంధించి ఫిర్యాదు అందినప్పటికీ, వారు నిందితులను రక్షించేందుకు వాస్తవాలను తారుమారు చేశారు. తగిన ఆధారాలు లేవనే సాకుతో కేసును మూసివేశారు" అని విజయ్ ఆరోపించారు. ఈ వ్యవహారంలో డీఎంకే, ఏఐఏడీఎంకే పరస్పరం సహకరించుకున్నాయని, అందుకే ఆ రెండు పార్టీలు నోరు మెదపడం లేదని విమర్శించారు. తన తల్లిని విమర్శించినా సహిస్తానని, కానీ తమిళనాడులోని మహిళా లోకాన్ని అవమానిస్తే ఊరుకోనని స్పష్టం చేశారు. డీఎంకే శ్రేణులు, వారి కుటుంబ సభ్యులు ఇటువంటి అనైతిక చర్యలను ప్రోత్సహిస్తున్నారని ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు.

మైనర్ బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఆరోపణలతో జెమ్ గ్రానైట్స్ చైర్మన్ ఆర్. వీరమణితో పాటు, ఆయనకు సహకరించిన శాంతి,

మహేంద్ర సింహన్‌లను 2026 ఆగస్టులో పోలీసులు అరెస్టు చేశారు. 2025లో ఓ సామాజిక కార్యకర్త విడుదల చేసిన వీడియో ఫుటేజ్‌తో ఈ ఉదంతం వెలుగులోకి వచ్చిన సంగతి తెలిసిందే. అయితే, ప్రస్తుత టీవీకే ప్రభుత్వ హయాంలో ప్రత్యేక పోక్సో కోర్టు గతంలోని క్లోజర్ రిపోర్ట్‌ను తిరస్కరించి, పునర్విచారణకు ఆదేశించింది. ఈ క్రమంలో పోలీసులు బాధితులను గుర్తించి, వారి వాంగ్మూలాలను నమోదు చేశారు. ప్రస్తుతం ఈ కేసు దర్యాప్తు కొనసాగుతుండగా, టీవీకే, డీఎంకే మధ్య ఇది ప్రధాన రాజకీయ పోరాటంగా మారింది.

# పెట్టుబడులే లక్ష్యంగా మంత్రి లోకేశ్ అహ్మదాబాద్ పర్యటన

- మొదటి పేజి తరువాయి

తయారీ వంటి కీలక రంగాల్లో ఏపీలో ఉన్న అవకాశాలను వారికి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ పారిశ్రామిక విధానాలు, అందిస్తున్న ప్రోత్సాహకాలను తెలియజేసి, పెట్టుబడులు పెట్టాల్సిందిగా ఆహ్వానించారు. లోకేశ్ ప్రతిపాదనలపై కంపెనీల ప్రతినిధులు సానుకూలంగా స్పందించి, వాటిని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. క్లీన్ ఎనర్జీలో ఏపీని ఎంచుకోండి: టోరెంట్ గ్రూప్‌తో లోకేశ్‌ఫార్మా, పవర్ రంగాల్లో అగ్రగామిగా ఉన్న టోరెంట్ గ్రూప్ చైర్మన్ సమీర్ మెహతా, ఇతర డైరక్టర్లతో మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. రాష్ట్రంలోని ఫార్మా క్లస్టర్లలో ఏపీఐ, ఇంటర్మీడియట్ తయారీ సామర్థ్యాన్ని విస్తరించాలని కోరారు. ముఖ్యంగా, పునరుత్పాదక ఇంధన రంగంలో టోరెంట్ గ్రూప్ ప్రణాళికలను ప్రస్తావిస్తూ.. సౌర, పవన, హైబ్రిడ్ ప్రాజెక్టులకు ఏపీ అనువైనదని తెలిపారు. పంప్డ్-స్టోరేజ్, గ్రీన్ హైడ్రోజన్ వంటి క్లీన్ ఎనర్జీ ప్రాజెక్టులకు రాష్ట్రాన్ని గమ్యస్థానంగా ఎంచుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై సమీర్ మెహతా స్పందిస్తూ.. 2030 నాటికి 10 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని సాధించడమే తమ లక్ష్యమని, ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను తప్పక పరిశీలిస్తామని చెప్పారు. కాకినాడలో ఇండస్ట్రియల్ పార్క్: వెల్ స్పన్ గ్రూప్‌కు ప్రతిపాదనటెక్స్‌టైల్స్, మౌలిక సదుపాయాల రంగంలో ప్రసిద్ధిగాంచిన వెల్ స్పన్ వరల్డ్ గ్రూప్ సీఈఓ నితిన్ జైన్‌తో లోకేశ్ సమావేశమయ్యారు. గతంలో దావోస్‌లో సీఎం చంద్రబాబుతో జరిగిన చర్చల పురోగతిని సమీక్షించారు. విశాఖపట్నంలో వెల్స్‌పన్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జీసీసీ) ఏర్పాటు చేయాలని ఆహ్వానించారు. కాకినాడలో టెక్స్‌టైల్స్, లాజిస్టిక్స్, పైపుల తయారీ, గ్రీన్ అమ్మోనియా యూనిట్లతో కూడిన ఇండస్ట్రియల్ పార్క్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. నితిన్ జైన్ మాట్లాడుతూ.. ప్రస్తుతం కర్నూలు, కడపలో తమ సంస్థ 100 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టును నిర్వహిస్తోం దని, తాజా ప్రతిపాదనలను కూడా పరిశీలిస్తామని తెలిపారు.

**నెల్లూరులో ఆయిల్ రిఫైనరీలు: గోకుల్ ఆగ్రోతో చర్చలు**

వంట నూనెల తయారీలో పేరొందిన గోకుల్ ఆగ్రో రిసోర్సెస్ చైర్మన్ కనుభాయ్ ఠక్కర్‌తో లోకేశ్ భేటీ అయ్యారు. నెల్లూరు జిల్లా కృష్ణపట్నంలో ఇప్పటికే ఉన్న ప్లాంట్‌కు అదనంగా పామాయిల్, సోయాబీన్ ఆయిల్ రిఫైనరీ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. దీనిపై కనుభాయ్ ఠక్కర్ స్పందిస్తూ.. కృష్ణపట్నంలో తమ ప్లాంట్ 2024 నుంచి ఉత్పత్తి ప్రారంభించిందని, దక్షిణాది మార్కెట్ల కోసం విస్తరణ ప్రణాళికలు ఉన్నాయని తెలిపారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనను పరిశీలనలోకి తీసుకుంటామని హామీ ఇచ్చారు.

**విశాఖలో టైర్ల తయారీ యూనిట్: చిరిపాల్ గ్రూప్‌కు ఆహ్వానం**

టెక్స్‌టైల్స్, కెమికల్స్ రంగాల్లోని చిరిపాల్ గ్రూప్ మేనేజింగ్ డైరక్టర్ బ్రిజ్ మోహన్ చిరిపాల్‌తో మంత్రి లోకేశ్ సమావేశమయ్యారు. విశాఖపట్నం కనెక్టివిటీ, మౌలిక వసతులను వివరిస్తూ.. అక్కడ గ్రీన్‌ఫీల్డ్ టైర్ల తయారీ ప్రాజెక్టును ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై బ్రిజ్ మోహన్ చిరిపాల్ స్పందిస్తూ.. ప్రస్తుతం తమకు పలు రాష్ట్రాల్లో తయారీ యూనిట్లు ఉన్నాయని, టైర్ల తయారీకి సంబంధించి ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనను పరిశీలిస్తామని అన్నారు.

**డేటా సెంటర్లలో పెట్టుబడులు పెట్టండి: ఎస్టీ టెలీమీడియాతో లోకేశ్**

డేటా సెంటర్ల దిగ్గజం ఎస్టీ టెలీమీడియా వైస్ ప్రెసిడెంట్ గౌతమ్ జెనాతో లోకేశ్ భేటీ అయ్యారు. విశాఖపట్నం డేటా సెంటర్ హబ్‌గా ఎదుగుతోందని, ఇప్పటికే గూగుల్, రిలయన్స్ వంటి సంస్థలు ముందుకు వచ్చాయని తెలిపారు. ఈ నేపథ్యంలో విశాఖలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. దీనిపై గౌతమ్ జెనా స్పందిస్తూ.. తమ సంస్థ కార్యకలాపాలను వివరించి, ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనను పరిశీలిస్తామని చెప్పారు.

**విశాఖలో ప్రీ ఫ్యాబ్ కేంద్రం: ఈప్యాక్ గ్రూప్‌తో భేటీ**

ప్రీ ఫ్యాబ్ నిర్మాణ రంగంలో పేరొందిన ఈప్యాక్ గ్రూప్ చైర్మన్ భజరంగ్ బోత్రాతో లోకేశ్ సమావేశమయ్యారు. డేటా సెంటర్ల నిర్మాణానికి అవసరమైన ప్రీ ఫ్యాబ్ నిర్మాణ కేంద్రాన్ని విశాఖలో ఏర్పాటు చేయాలని కోరారు. భజరంగ్ బోత్రా మాట్లాడుతూ.. ఇప్పటికే శ్రీసిటీలో తమకు తయారీ యూనిట్లు ఉన్నాయని, విశాఖ ప్రతిపాదనను కూడా పరిశీలిస్తామని తెలిపారు.

**పైపుల తయారీ కేంద్రం ఏర్పాటు చేయండి: ఆస్ట్రల్ పైప్స్‌తో సమావేశం**

పైపుల తయారీలో అగ్రగామిగా ఉన్న ఆస్ట్రల్ పైప్స్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ అల్పేష్ పంచల్‌తో మంత్రి లోకేష్ చర్చలు జరిపారు. రాష్ట్రంలో నిర్మాణ రంగం వేగంగా అభివృద్ధి చెందుతున్నందున, కాకినాడ లేదా అనకాపల్లిలో పైపుల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఆహ్వానించారు. అల్పేష్ పంచల్ స్పందిస్తూ.. తమకు దేశవ్యాప్తంగా విస్తృత నెట్‌వర్క్ ఉందని, ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనను పరిగణనలోకి తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## 'బ్రహ్మోస్'తో పాకిస్థాన్‌కు నిద్రలేని రాత్రులు

- మొదటి పేజి తరువాయి

నాశనం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. నోయిడాలో నిర్వహించిన ఉత్తర్‌ప్రదేశ్ అంతర్జాతీయ వాణిజ్య ప్రదర్శన ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు. 2017 తర్వాత భాజపా హయాంలో యూపీ అద్భుత ప్రగతి సాధిస్తోందన్నారు. ప్రధాని మోదీ సారథ్యంలో భారత్ గణనీయమైన ఆర్థిక వృద్ధి సాధిస్తోందన్న అమిత్ షా.. ప్రపంచ వ్యాప్తంగా వాతావరణ, ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా లేనప్పటికీ స్థిరమైన వృద్ధిరేటు సాధిస్తున్నామన్నారు. భారత ఆర్థిక వ్యవస్థను ఉన్నత స్థితికి చేర్చే లక్ష్యంగాలో భాగంగానే.. మారిషస్, యూఏఈ, ఆస్ట్రియా, యూకే, ఒమన్, న్యూజిలాండ్, యూరోపియన్ యూనియన్ తదితర దేశాలతో భారత్ వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు చెప్పారు. యూపీలో అమలు చేస్తున్న 'వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్' విధానాన్ని అమిత్ షా అభినందించారు. గతంలో ఇక్కడి ప్రజలు ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లేవారని.. కానీ, ఎన్డీయే ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత పరిస్థితులు మారాయన్నారు. గతంలో నేరపూరిత వాతావరణం ఉన్న రాష్ట్రం.. ఇప్పుడు ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నాయకత్వంలో రక్షణ రంగం, వాహన ఉత్పత్తి, వైద్యపరికరాల తయారీ వైపు దూసుకెళ్తోందని కితాబిచ్చారు. సరిగ్గా 12 ఏళ్ల క్రితం ఇదే రోజున (సెప్టెంబర్ 25) ప్రధాని మోదీ 'మేక్ ఇన్ ఇండియా' నినాదం తీసుకొచ్చినట్లు అమిత్ షా గుర్తు చేశారు.

## మహిళలను పారిశ్రామికవేత్తలుగా
# తీర్చిదిద్దడమే లక్ష్యం

- మొదటి పేజి తరువాయి

సరస్ ప్రదర్శన' ఏర్పాట్లను రాష్ట్ర ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఉన్నతాధికారులతో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మహిళా స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మెరుగైన మార్కెట్ సౌకర్యాన్ని కల్పించడమే ధ్యేయంగా నేషనల్ సరస్ మేళాను ఢిల్లీ నుంచి విజయవాడకు తీసుకువచ్చామని తెలిపారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే మహిళా పారిశ్రామికవేత్తల కోసం 350కి పైగా స్టాళ్లను సిద్ధం చేస్తున్నామని, ఇందులో ఒక్క ఆంధ్రప్రదేశ్ నుంచే సుమారు 250 స్టాళ్లు ఉండబోతున్నాయని చెప్పారు. ఇతర రాష్ట్రాల విజయగాథలు, అనుభవాలను పంచుకునేలా ఈ మేళాను ఒక ప్రత్యేక 'లెర్నింగ్ సెంటర్'గా మలుస్తున్నామని పేర్కొన్నారు. అంతేకాకుండా, ఆంధ్రప్రదేశ్‌లో మహిళలు తయారు చేసే నాణ్యమైన ఉత్పత్తులకు గుర్తింపు కల్పించేందుకు 'స్వయం ఏపీ' అనే ప్రతిష్ఠాత్మక బ్రాండ్‌ను ప్రతిపాదించినట్లు వెల్లడించారు. దీని ద్వారా బ్రాండింగ్, ప్యాకేజింగ్, మార్కెటింగ్ అంశాల్లో మహిళలకు అవసరమైన పూర్తి సహకారాన్ని అందిస్తామన్నారు. దసరా ఉత్సవాల వేళ విజయవాడకు ఈ ఈవెంట్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని, సందర్శకుల సౌకర్యాలు, భద్రత మరియు పార్కింగ్ ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అధికారులతో విస్తృత సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు.

## ఏపీ హోంగార్డులకు శుభవార్త.. కానిస్టేబుల్
## ఉద్యోగాల్లో 10 శాతం రిజర్వేషన్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని హోంగార్డులకు ప్రభుత్వం శుభవార్త వినిపించింది. పోలీస్ శాఖలో స్టైపెండరీ కానిస్టేబుల్ (డ్రైవర్) పోస్టుల నియామకాల్లో వారికి 10 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు గతంలో ఉన్న ప్రభుత్వ ఉత్తర్వులను (జీవో) సవరిస్తూ నూతన ఆదేశాలను జారీ చేసింది. ప్రభుత్వ నిర్ణయం సుదీర్ఘ కాలంగా ఎదురుచూస్తున్న హోంగార్డులకు పెద్ద ఊరటనిచ్చింది. పోలీస్ రవాణా సంస్థ (ట్రాన్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్) పరిధిలో 198 స్టైపెండరీ కానిస్టేబుల్ (డ్రైవర్) పోస్టుల భర్తీకి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఈ పోస్టుల భర్తీకి సంబంధించిన నోటిఫికేషన్ ఈ నెలలోనే విడుదలయ్యే అవకాశం ఉంది. ఈ నియామక ప్రక్రియ నుంచే హోంగార్డులకు కేటాయించిన 10 శాతం రిజర్వేషన్ అమలులోకి రానుంది. నూతన రిజర్వేషన్ విధానం ద్వారా శాశ్వత ప్రభుత్వ ఉద్యోగాల్లో చేరాలనుకుంటున్న అర్హులైన హోంగార్డులకు మెరుగైన అవకాశాలు లభిస్తాయని అధికారులు భావిస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయం పట్ల హోంగార్డుల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

## సీజేపీ చీఫ్ అభిజిత్ దీప్కేకు..
## ఢిల్లీ హైకోర్టు నోటీసులు

- మొదటి పేజి తరువాయి

రత్న సింగ్ లకు నోటీసులిచ్చింది. అనుమతి లేకుండా తన ఫొటోలు తీసి డిజిటల్ మార్ఫింగ్ చేశారని ఓ మహిళనుంచి ఇచ్చిన ఫిర్యాదుతో స్పందించిన కోర్టు ఈ చర్యలు తీసుకుంది. అక్టోబర్ 2న దేశవ్యాప్త నిరసనలకు సీజేపీ రెడీ అవుతున్న క్రమంలో హైకోర్టు నోటీసులు చర్చనీయాంశమయ్యాయి. తన అనుమతి లేకుండా ఫోటో తీసి, ఆ తర్వాత ఏఐ, ఫేస్-స్వాపింగ్ టూల్స్ ఉపయోగించి డిజిటల్‌గా మార్ఫింగ్ చేశారని ఓ మహిళ ఢిల్లీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు ప్రకారం.. ప్రధాని మోదీతో కలిసి ఉన్న తన ఫోటోపై ఆమె ముఖాన్ని మార్ఫింగ్ చేశారని ఆరోపించింది. ఫిర్యాదులో సీజేపీ ప్రతినిధులు సౌరభ్ దాస్, అభిజీత్ దీప్కే, అశుతోష్ రాంకా, రత్న సింగ్‌లతో పాటు వారి సహచరులుగా ఆరోపించబడిన కొందరి పేర్లను పేర్కొంది. జంతర్ మంతర్ నిరసనల్లో మార్ఫింగ్ చేసిన తన ఫొటోలను ప్రచారం చేయడంతో తనకు బెదిరింపులు వస్తున్నాయని, తనకు రక్షణ కల్పించాలని కోరింది. ఈ కేసులో మహిళకు పూర్తి రక్షణ కల్పించాలని శుక్రవారం ఢిల్లీ హైకోర్టు పోలీసులను ఆదేశించింది. మహిళ భద్రతకోసం ఆమె అడ్రస్ సీక్రెట్ గా ఉంచాలని పోలీసులకు సూచించింది. దీంతోపాటు వెబ్ లింకులనుంచి , సోషల్ మీడియా ప్లాట్ ఫాంలనుంచి ఆమె ఫొటోలను తొలగించాలని మెటాకు ఆదేశించింది. ఈ కేసు ఢిల్లీ హైకోర్టులో ఉండగా, పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. సీఈసీ రాజీనామా చేయాలని అక్టోబర్ 2న సీజేపీ తలపెట్టిన దేశవ్యాప్త నిరసనలకు ముందు హైకోర్టు నోటీసులు జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది.

# పవర్ గాయ్స్ ఆధ్వర్యయం లో భారీ అన్నసమారాధన



**గాజువాక :పెన్ పవర్,సెప్టెంబర్25** పవర్ గాయ్స్ యూత్ నరపిన్ని తరుణ్ ఆధ్వర్యం లో అన్నదానం గొంతినవాని పాలెం జంక్షన్ లో ముఖ్య అతిదులు గా బిజెపి గాజువాక ఇంచార్జ్ కరణంరెడ్డి నరిసింగరావు, 71వార్డు ఎక్స్ కార్పొరేటర్ రాజాన్ రామారావుగారు,గాజువాక సర్కిల్ ఇన్స్పెక్టర్ వాసు నాయుడు , సబ్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ ,గుటూరు శంకరావు ,బిజెపి యువమోర్చా గాజువాక ప్రెసిడెంట్ జగరపు శ్రీను,కరణం పెంటారావు పాల్గొని అన్నసమారాధన కార్యక్రమం ప్రారంభించారు. యూత్ చందు, వెంకీ,చిరు,గౌతం కార్తీక్,ప్రసాద్, జయరామ్ హరీష్ శశి సురేందర రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

# అల్లూరి జిల్లాకు ప్రత్యేక జెడ్పీ.. ప్రజా కేంద్రిత పాలనకు శ్రీకారం





- అల్లూరి జిల్లాకు ప్రత్యేక జిల్లా ప్రజా పరిషత్ ప్రారంభం
- ప్రత్యేక అధికారిగా జిల్లా కలెక్టర్ టి. నిశాంతి బాధ్యతల స్వీకరణ

**స్టాఫ్ రిపోర్టర్ పాడేరు, పెన్ పవర్, సెప్టెంబర్ 25:**అల్లూరి సీతారామరాజు జిల్లా ప్రజా పరిషత్ (జడ్పిపి -- ఏఎస్ఆర్ ) కార్యకలాపాలు శుక్రవారం అధికారికంగా ప్రారంభమయ్యాయి. పాడేరు ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రారంభ కార్యక్రమానికి విశాఖపట్నం జిల్లా ప్రజా పరిషత్ డిప్యూటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కె. రాజ్‌కుమార్ అధ్యక్షత వహించారు.ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికైన జిల్లా ప్రజా పరిషత్‌ల ఐదేళ్ల పదవీకాలం సెప్టెంబర్ 24తో ముగిసిన నేపథ్యంలో, కొత్తగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు బాధ్యతలు స్వీకరించే వరకు జిల్లా ప్రజా పరిషత్‌లకు జిల్లా కలెక్టర్లు ప్రత్యేక అధికారులుగా వ్యవహరించనున్నారు. ఈ నేపథ్యంలో అల్లూరి సీతారామరాజు జిల్లా ప్రజా పరిషత్ ప్రత్యేక అధికారిగా జిల్లా కలెక్టర్ టి. నిశాంతి బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అల్లూరి సీతారామరాజు జిల్లాకు ప్రత్యేక జిల్లా ప్రజా పరిషత్ ఏర్పాటు కావడం ద్వారా జిల్లాలోని స్థానిక అవసరాలు, ప్రాధాన్యతలకు అనుగుణంగా గ్రామీణాభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమగ్ర ప్రణాళిక, సమన్వయం, పర్యవేక్షణకు మరింత అవకాశం ఏర్పడిందన్నారు. వికేంద్రీకృత పరిపాలనను బలోపేతం చేయడంతో పాటు ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు గిరిజన ప్రాంతాల ప్రజలకు మరింత సమర్థవంతంగా చేరేందుకు జడ్పిపి -- ఏఎస్ఆర్ కీలక వేదికగా నిలుస్తుందని తెలిపారు. అధికారులు, సిబ్బంది అంకితభావం, సమన్వయం, పారదర్శకత, జవాబుదారీతనంతో విధులు నిర్వహిస్తూ గిరిజన ప్రజల సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. గ్రామీణాభివృద్ధి, విద్య, పారిశుధ్యం, మౌలిక వసతులు, ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలు, పర్యవేక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు.ప్రస్తుతం జడ్పిపి -- ఏఎస్ఆర్ కార్యకలాపాలు పాడేరు ఎంపీడీవో కార్యాలయం నుంచి ప్రారంభమయ్యాయి. పాతపాడేరులోని కమ్యూనిటీ భవన్‌లో నూతన జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయాన్ని సిద్ధం చేస్తున్నారు. భవనం సిద్ధమైన అనంతరం 15 నుంచి 20 రోజుల్లో కార్యాలయాన్ని అక్కడికి తరలించనున్నట్లు అధికారులు తెలిపారు. విశాఖపట్నం జిల్లా ప్రజా పరిషత్ పునర్వ్యవస్థీకరణ అనంతరం మూడు జిల్లా ప్రజా పరిషత్‌లుగా విభజించబడింది. అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాలకు ప్రత్యేక జిల్లా ప్రజా పరిషత్‌లు ఏర్పాటయ్యాయి. ఇందులో భాగంగా జడ్పిపి --ఎఎస్ఆర్ సెప్టెంబర్ 25 నుంచి అధికారికంగా కార్యకలాపాలు ప్రారంభించింది.జడ్పిపి -- అల్లూరి జిల్లా పరిధిలో 11 మండలాలు, 244 గ్రామ పంచాయతీలు, 11 జెడ్పీటీసీ స్థానాలు, 172 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి.అల్లూరి జిల్లాకు ప్రభుత్వం ఇటీవల జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి (సీఈఓ), డిప్యూటీ సీఈఓ పోస్టులను మంజూరు చేసింది. కొత్త జిల్లాల మధ్య అధికారులు, సిబ్బంది కేటాయింపు ప్రక్రియలో భాగంగా జడ్పిపి -- అల్లూరి జిల్లాకు కు మొత్తం 19 పోస్టులను గుర్తించగా, 17 పోస్టులకు సిబ్బందిని కేటాయించారు. మరో రెండు పోస్టులు ప్రస్తుతం ఖాళీగా ఉన్నాయి.కేటాయించబడిన అధికారులు, సిబ్బంది నూతన జిల్లా ప్రజా పరిషత్ కార్యకలాపాల్లో విధులు నిర్వహిస్తూ జిల్లా గ్రామీణాభివృద్ధి, స్థానిక సంస్థల పరిపాలనలో సమన్వయంతో పనిచేయనున్నారు.ప్రారంభోత్సవ కార్యక్రమంలో జీసీసీ డైరెక్టర్ బి. నాగరాజు, జనపద కళలు--సృజనాత్మకత అకాడమీ చైర్మన్ డాక్టర్ వి. గంగులయ్య, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, ఆర్టీసీ జోనల్ చైర్మన్ సియారి దొన్నుదొర, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు ఎం. శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు జిల్లాకు ప్రత్యేక జిల్లా ప్రజా పరిషత్ ఏర్పాటు కావడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. ప్రత్యేక జడ్పిపి ద్వారా జిల్లాలోని స్థానిక అవసరాలకు అనుగుణంగా గ్రామీణాభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు మరింత ప్రాధాన్యత లభిస్తుందని పేర్కొన్నారు.కార్యక్రమంలో పీడీ--డీఆర్‌డీఏ, పీడీ--డీడబ్ల్యూఎంఏ, డీపీవో, డీఎల్‌పీవో, ఆర్డీవో, ఎంపీడీవోలు, ఇతర జిల్లా స్థాయి అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. జడ్పిపి -- అల్లూరి జిల్లాకు నూతనంగా కేటాయించబడిన 17 మంది సిబ్బంది కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు.ప్రజలకు వేగవంతమైన సేవలు అందించేలా, పారదర్శకమైన, సమర్థవంతమైన, ప్రజా కేంద్రిత స్థానిక పాలనకు జడ్పిపి -- ఏఎస్ఆర్ ను బలమైన వేదికగా తీర్చిదిద్దేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

# ప్రమాదాలు పునరావృతం కాకుండా చర్యలు



కలెక్టర్ అభిషిక్త్ కిశోర్

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, సెప్టెంబర్ 25 :** జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖలు సమన్వయంతో సమగ్ర చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. ప్రమాదాల్లో గాయపడిన వారికి సకాలంలో అత్యవసర వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన జిల్లా రహదారి భద్రతా కమిటీ సమావేశంలో రోడ్డు ప్రమాదాల పరిస్థితి, నివారణ చర్యలు, బాధితులకు అందుతున్న వైద్య సేవలు, గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలు తదితర అంశాలను కలెక్టర్ సమీక్షించారు.జాతీయ రహదారుల సంస్థ పరిధిలో ఉన్న అం బులెన్సుల సంఖ్య, వాటి నిర్వహణ, ఇప్పటివర కు ఎంతమంది క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలించారు, ఎంతమందికి వైద్య సేవలు అం దించారనే వివరాలను తదుపరి సమావేశానికి సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదే శించారు. 108 వాహనాల సమన్వయ అధికా రితో సమన్వయం చేసుకోవాలని సూచించారు.ప్రతి నెలా నమోదైన రోడ్డు ప్రమాదాలు, మర ణాలపై సమగ్ర ఆడిట్ నిర్వహించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాల ప్రమాదాల వివరాలతో పాటు మరణాలకు గల కారణాలను నివేదికలో పొం దుపరచాలని సూచించారు. ఐరాడ్ యాప్‌లో బాధితుల వివరాలను తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలని తెలిపారు.ఒకసారి ప్రమాదం జరిగిన ప్రాంతంలో మరోసారి ప్రమాదం జరగకుండా తగి న శాశ్వత చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశిం చారు. జాతీయ రహదారులపై బ్లాక్‌స్పాట్లను తగ్గించడంతో పాటు అవసరమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచిం చారు. జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ పరిధిలో ప్రతిపా దించిన పనులను వేగంగా పూర్తి చేయాలని, ఆర్థికేతర పనులకు ప్రాధాన్యమిస్తూ ముందుగా చేపట్టాలని తెలిపారు.నగరంలో 11 ప్రాంతాల్లో ట్రాఫిక్ సిగ్నల్స్ పనిచేయడం లేదని గత సమా వేశంలో గుర్తించిన అంశంపై జీవీఎంసీ ఎస్‌ఈని కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆరు సిగ్నల్స్ పనులు వేగంగా జరుగుతున్నాయని, మిగిలిన సిగ్నల్స్ పనులను ఈ నెలాఖరులోగా పూర్తి చేస్తామని ఎస్‌ఈ తెలిపారు.ఆనందపురం పూల మార్కెట్‌ను ప్రస్తుత ప్రాంతం నుంచి తరలించేందుకు భీమిలి ఆర్డీవో, వీఎంఆర్‌డీఏ అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ మాట్లాడుతూ అధిక వేగం రోడ్డు ప్రమా దాలకు ప్రధాన కారణాల్లో ఒకటని పేర్కొన్నారు. బస్సులు, డ్రైవర్లపై తనిఖీలు ముమ్మరం చేయాలని సూచించారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

ఈ సమావేశంలో డీసీపీలు మేరీ ప్రశాంతి, మణి కంఠ, రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అధికారి విజయ్ ప్రకాశ్, ఎంవీఐలు, పోలీసు అధికారులు, జీవీఎంసీ, ఎన్‌హెచ్‌ఏఐ, ఆర్‌అండ్‌బీ, ఏపీఎస్‌ఆర్టీసీ, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం--ప్రజల మధ్య వారధి మీడియా: రామ్మోహన్ నాయుడు






- ప్రభుత్వ పథకాలపై విస్తృత అవగాహన కల్పించాలని పిలుపు
- శ్రీకాకుళంలో పీఐబీ 'వార్తాలాప్' మీడియా వర్క్‌షాప్
- గ్రామీణ సమస్యలు, అభివృద్ధి జర్నలిజానికి ప్రాధాన్యం ఇవ్వాలి
- సోషల్ మీడియా, తప్పుడు సమాచార కట్టడి, స్వయం ఉపాధిపై చర్చ

**శ్రీకాకుళం, పెన్ పవర్, సెప్టెంబర్ 25:**ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు చేరవేయడంలో మీడియా కీలక పాత్ర పోషిస్తుందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు అన్నారు. ప్రభుత్వం--ప్రజల మధ్య మీడియా బలమైన వారధిగా పనిచేస్తుందని పేర్కొన్నారు.శ్రీకాకుళంలో నిర్వహించిన పీఐబీ 'వార్తాలాప్' మీడియా అవుట్‌రీచ్ వర్క్‌షాప్లో పాల్గొన్న జర్నలిస్టులకు ఆయన ప్రత్యేక సందేశం ఇచ్చారు. ప్రధానమంత్రి ముద్ర యోజన, స్టార్టప్ ఇండియా, పీఎం విశ్వకర్మ, స్కిల్ ఇండియా వంటి పథకాలపై ప్రజల్లో అవగాహన పెంచాలని సూచించారు.పీఐబీ విజయవాడ ప్రాంతీయ కార్యాలయ డైరెక్టర్ జి. సురేష్ కుమార్ వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. ప్రభుత్వ విధానాలు, కార్యక్రమాలకు సంబంధించిన ప్రామాణిక, సకాల సమాచారాన్ని మీడియాకు అందించడంలో పీఐబీ కీలకంగా వ్యవహరిస్తోందన్నారు.డా. బి.ఆర్. అంబేద్కర్ విశ్వవిద్యాలయం జర్నలిజం విభాగాధిపతి డా. రెడ్డి తిరుపతి రావు మాట్లాడుతూ గ్రామీణ సమస్యలు, అభివృద్ధి జర్నలిజానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. పథకాల అమలు తీరుతో పాటు వాటివల్ల లబ్ధిదారుల జీవితాల్లో వస్తున్న మార్పులను వెలుగులోకి తీసుకురావాలని జర్నలిస్టులకు పిలుపునిచ్చారు.వివిధ శాఖల అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రభుత్వ పథకాలు, వాటి క్షేత్రస్థాయి అమలుపై జర్నలిస్టులు--అధికారుల మధ్య జరిగిన ముఖాముఖి చర్చతో వర్క్‌షాప్ ముగిసింది.

# 616 మంది లబ్ధిదారులకు రిజిస్టర్డ్ ఆస్తి పత్రాలు




61, 62, 63 వార్డుల్లో పంపిణీ చేసిన ప్రభుత్వ విప్ గణబాబు

**ములగాడ, పెన్ పవర్ సెప్టెంబర్ 25 :** విశాఖపట్నం పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 61, 62, 63 వార్డులకు చెందిన 616 మంది లబ్ధిదారులకు శాశ్వత రిజిస్టర్డ్ ఆస్తి పత్రాలను ప్రభుత్వ విప్, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే పి.జి.వి.ఆర్. నాయుడు గణబాబు పంపిణీ చేశారు.పేదలకు పట్టాభిషేకం-- మీ ఇల్లు మీ హక్కు' కార్యక్రమంలో భాగంగా 63వ వార్డు క్రాంతినగర్, 62వ వార్డు ఏఎస్ఆర్ కాలనీతో పాటు 61వ వార్డులోని మరిడిమాంబ కళ్యాణమండపంలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వ హించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు అధి కారిక రిజిస్టర్డ్ ఆస్తి పత్రాలను ఎమ్మెల్యే అందజే శారు.ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ, లబ్ధిదారులకు సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం ద్వారా రిజిస్టర్డ్ కన్వేయెన్స్ డీడ్స్ అందిస్తున్నట్లు తెలిపారు. దశాబ్దాలుగా నివాసముంటున్న స్థలాలపై చట్టబద్ధమైన యాజమాన్య హక్కులు కల్పించడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని పేర్కొన్నారు. ఆస్తి పత్రాల ద్వారా బ్యాంకు రుణాలు పొందేందుకు అవకాశం ఉంటుందని, పిల్లల విద్య, కుటుంబ ఆర్థిక అవసరాలకు వాటిని వినియోగించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ములగాడ తహసీల్దార్ రామ లక్ష్మి, రెవెన్యూ అధికారులు, ఆయా వార్డుల ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ప్రకృతి కన్నెర్ర.. పాలన నిర్లక్ష్యం.. గర్భిణి మృతి!



**ఐదు రోజులుగా భారీ వర్షాలు.. పురిటి నొప్పులతో ఇంటివద్దే విషాదాంతం**

**గిరిజన గ్రామాల గుండెకోత.. శాశ్వత వంతెనలు నిర్మించాలని వేడుకోలు**

**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 25:**అల్లూరి సీతారామరాజు జిల్లాలో భారీ వర్షాలు గిరిజనుల జీవితాలను అతలాకుతలం చేస్తున్నాయి. రహదారులు, వంతెనలు దెబ్బతినడంతో అత్యవసర వైద్యం అందక ఓ గర్భిణి మృతి చెందిన విషాద ఘటన గూడెంకొత్తవీధి మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చిన్నగంగవరం గ్రామానికి చెందిన సన్యాసిరావు భార్య గర్భిణి. గురువారం ఆమెకు పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించేందుకు ప్రయత్నించారు. అయితే గత ఐదు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గంగవరం వద్ద ఉన్న వంతెన వరద ఉధృతికి కొట్టుకుపోవడంతో గ్రామానికి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.గర్భిణిని ఆస్పత్రికి తరలించేందుకు ప్రత్యామ్నాయ మార్గం లేకపోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. సకాలంలో వైద్యం అందక ఆమె ఇంటివద్దే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.వంతెన లేక.. వైద్యం అందక.. వర్షాలు వచ్చిన ప్రతిసారీ తమ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో కూడా ఆస్పత్రులకు చేరుకోలేని దుస్థితి నెలకొందని కన్నీరుమున్నీరవుతున్నారు. వంతెనలు, రహదారులు లేక సకాలంలో వైద్యం అందక ప్రాణాలు కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గిరిజన గ్రామాలకు శాశ్వత రహదారులు, వంతెనలు నిర్మించి, అత్యవసర వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# ఐటీడీఏ పీవో ఆదిత్య వర్మకు డీఆర్వోగా అదనపు బాధ్యతలు



**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు, పెన్ పవర్, సెప్టెంబర్ 25:** అల్లూరి సీతారామరాజు జిల్లా జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) పోస్టుకు పాడేరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి (పీవో) శ్రీ ఆదిత్య వర్మకు తాత్కాలిక బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ టి. నిశాంతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 25, 2026 నుంచి ఆదిత్య వర్మ తన ప్రస్తుత ఐటీడీఏ పీవో బాధ్యతలను కొనసాగిస్తూనే, జిల్లా రెవెన్యూ అధికారి పోస్టుకు సంబంధించిన తాత్కాలిక బాధ్యతలను కూడా నిర్వహించనున్నారు. జిల్లా రెవెన్యూ పరిపాలనకు సంబంధించిన విధులు, కార్యకలాపాలు సజావుగా కొనసాగేందుకు ఈ తాత్కాలిక బాధ్యతల ఏర్పాటును చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. డీఆర్వోగా అదనపు బాధ్యతలు స్వీకరించిన ఆదిత్య వర్మ జిల్లా రెవెన్యూ పరిపాలనకు సంబంధించిన అంశాలను పర్యవేక్షించనున్నారు.

# దారకొండలో విరిగిపడిన కొండచరియలు.. నిలిచిన రాకపోకలు

- రంగంలోకి ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు..



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 25:** భారీ వర్షాల నేపథ్యంలో అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలం దారకొండ సమీపంలో కొండచరియలు చెట్లు విరిగిపడ్డాయి. దారాలమ్మ ఆలయానికి సమీపంలోని దారగొంది ప్రధాన రహదారిపై మలుపు వద్ద శుక్రవారం కొండచరియలు విరిగిపడటంతో పెద్దఎత్తున మట్టి, చెట్లు రహదారిపైకి చేరాయి. దీంతో సప్పర్ల--సీలేరు మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించాయి. రహదారిపై పడిన చెట్లు, మట్టిని తొలగిస్తూ రాకపోకలను పునరుద్ధరించేందుకు ముమ్మరంగా చర్యలు చేపడుతున్నారు. భారీ వర్షాలు కొనసాగుతున్న నేపథ్యంలో కొండ ప్రాంతాల్లో ప్రయాణించే వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉన్న ప్రాంతాల్లో అత్యవసరమైతే తప్ప ప్రయాణించవద్దని, రహదారి పరిస్థితులను గమనిస్తూ సురక్షితంగా ప్రయాణించాలని సూచించారు.

# చింతపల్లి మండల కేంద్రంలో ఘనంగా పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలు.



**చింతపల్లి పెన్ పవర్ సెప్టెంబర్ 25.** అల్లూరి సీతారామరాజు జిల్లా, చింతపల్లి మండల కేంద్రంలో భారతీయ జనసంఘ్ మహానేత, ఏకాత్మ మానవతావాద సిద్ధాంతకర్త పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ గారి జయంతి కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ గారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. సమాజంలోని అట్టడుగు వర్గాల అభ్యున్నతి, అంత్యోదయ స్ఫూర్తి, దేశ సేవ కోసం ఆయన చేసిన కృషిని నాయకులు, కార్యకర్తలు స్మరించుకున్నారు. పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ గారు ప్రతిపాదించిన ఏకాత్మ మానవతావాదం, అంత్యోదయ భావన సమాజంలోని ప్రతి ఒక్కరి సంక్షేమాన్ని లక్ష్యంగా చేసుకున్నవని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు జైతి ప్రభాకర్ రావు, బీజేపీ జిల్లా ఐటి కన్వీనర్ పండ ఈశ్వర్ రావు, బీజేపీ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు కదుల్లా శ్రీనివాస్, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు వసుపరి శ్రీనివాస్, మండల యువ మోర్చా అధ్యక్షులు దేపూరి సోమలింగం, మండల కార్యదర్శి మాతే లక్ష్మణ రావు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# రోడ్డు ఆనవాళ్లు మాయం.. ఎం.బూషికొండకు రాకపోకలు ప్రశ్నార్థకం!





### తక్షణమే మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తుల విజ్ఞప్తి

**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 25:** గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలం గాలికొండ పంచాయతీ పరిధిలోని ఎం.బూషికొండ గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి తీవ్రంగా దెబ్బతింది. వర్షపు నీటి ఉధృతికి రహదారి పలుచోట్ల కోతకు గురై పెద్దపెద్ద గోతులు ఏర్పడి రాకపోకలకు పూర్తిగా ఇబ్బందికరంగా మారింది. వర్షపు నీరు రహదారికి అడ్డంగా ప్రవహించడంతో రోడ్డు కొంతభాగం కొట్టుకుపోయి పూర్తిగా అస్తవ్యస్తంగా మారింది. ప్రస్తుతం ఈ రహదారిపై నడక సాగించడం మినహా కనీసం ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దీంతో గ్రామస్తులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో రహదారి నిర్మాణ సమయంలో ఇరువైపులా డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసి ఉంటే భారీ వర్షపు నీటి ప్రవాహం నుంచి రహదారిని కొంతవరకు రక్షించవచ్చని గ్రామస్తులు పేర్కొన్నారు. డ్రైనేజీలు లేకపోవడంతో ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వర్షపు నీరు నేరుగా రహదారిపైకి ప్రవహించి కోతకు గురిచేసిందని తెలిపారు. రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో అత్యవసర పరిస్థితుల్లో గ్రామానికి రాకపోకలు సాగించడం కూడా కష్టంగా మారిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తక్షణమే స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టి రాకపోకలను పునరుద్ధరించాలని గ్రామస్తులు జర్త శంకరరావు, జర్త రాము, కోపూరు కామరాజు, జర్త రామారావు కోరారు.

# వరద ఉధృతికి అన్నదాతల ఆశలు గల్లంతు..



- పెద్దగొందిపల్లిలో కొట్టుకుపోయిన వరి పైరు
- పంట నష్టాన్ని పరిశీలించిన అధికారులు, జనసేన నేతలు..

**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 25:** భారీ వర్షాలు, వరదల తాకిడికి గూడెంకొత్తవీధి మండలం పెద్దగొందిపల్లి పరిధిలో వరి పంట పొలాలు కొట్టుకుపోయాయి. వరి పైరు వరద ఉధృతికి నీటిపాలవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. పంట నష్టాన్ని తెలుసుకునేందుకు మండల వ్యవసాయ అధికారి, పంచాయతీ ప్రత్యేక అధికారి ఎన్. సురేష్ క్షేత్రస్థాయిలో పర్యటించి దెబ్బతిన్న వరి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో అధికారులు నేరుగా మాట్లాడి నష్టపోయిన వరి పొలాలకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. వరద ఉధృతికి వరి పైరు కొట్టుకుపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు రైతుల సమస్యలను అధికారులు సావధానంగా విన్నారు. ప్రతి ఎకరాలో జరిగిన పంట నష్టాన్ని క్షేత్రస్థాయిలో పారదర్శకంగా అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని రైతులకు భరోసా ఇచ్చారు. ఈ పర్యటనలో జనసేన పార్టీ అరకు పార్లమెంట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గొర్లె వీర వెంకట్ పాల్గొని రైతులతో నేరుగా మాట్లాడారు. వరదల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారని, అన్నదాతలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకునేలా తన వంతు చొరవ తీసుకుంటామని ఆయన తెలిపారు. పంట నష్టానికి తగిన పరిహారం అందేలా అధికారుల దృష్టికి రైతుల సమస్యలను తీసుకెళ్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకుడు సాగిన కృష్ణ, జనసేన నాయకులు పరమేష్, కొయ్యం సిద్దు తదితరులతో పాటు రైతులు మచ్చల పెద్దబ్బి, కొడబాల పెద్దబ్బి, శాలిమితి బాలయ్య, పోతూరు సన్యాసమ్మ, దేశగిరి శుభద్ర, శాలిమితి రేణుక తదితరులు పాల్గొన్నారు.

# గృహాలు కోల్పోయి నిరాశ్రయులైన కుటుంబాలు

అరబీరు, మేభ గ్రామాలలో నేల కూలిన గృహాలు.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, సెప్టెంబరు 25.** బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలో గల మాకవరం పంచాయతీ, అరబీరు గ్రామానికి చెందిన జనం రొయిల గృహము, అదేవిధంగా మేభ గ్రామానికి చెందిన గోపాలరావు గృహాలు యొక్క ఇంటి గోడలు నేలమట్టమైనట్లు టిడిపి నాయకుడు చెండా బాపూజీ తెలిపారు. జరిగిన ఘటనను రెవెన్యూ అధికారులకు సమాచారం అందించామని, గృహాలు కోల్పోయి నిరాశ్రయులైనా బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# అర్ణబ్ తుపాన్ ప్రభావంతో భారీ నష్టం

- బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్.
- మహిళా సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు ఎస్ ఈశ్వరి, ఎస్ విజయ.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, సెప్టెంబరు 25.** బంగాళాఖాతంలో ఏర్పడ్డ తీవ్ర వాయుగుండం/ అర్ణబ్ తుపాను కారణంగా ముంచంగిపుట్టు మండలంలో భారీ ఆస్తి నష్టాలు జరిగినట్లు ఆదివాసి మహిళా సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు ఎస్ ఈశ్వరి, విజయ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం వారు మాట్లాడుతూ.. ఏకధాటిగా కురుస్తున్న భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలలో వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయనీ, పంటపొలాలో నీరు చేరటంతో రైతులు తీవ్రంగా నష్ట పోయే పరిస్థితి నెలకొందని వారు అవేదన వ్యక్తం చేశారు. పలుచోట్ల రహదారులు దెబ్బతిన్నాయని, కొన్ని గ్రామాల్లో గృహాలో కూడా నేలమట్టం కావటంతో అనేకమంది బాధితులు నిరాశ్రయులయ్యారనీ అన్నారు. వాగులు వంకలు పొంగి ఉదృతంగా ప్రవహిస్తున్న వేళ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. గ్రామాల్లో సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించి బాధితులను నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.



# వరదను దాటి గర్భిణికి సకాలంలో వైద్యం

- కలెక్టర్ చొరవతో ప్రత్యామ్నాయ మార్గంలో తరలింపు..
- పండంటి మగబిడ్డకు జన్మ



**గూడెం కొత్త వీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 25:** భారీ వర్షాలు, వరదలతో రహదారులు తెగిపోయినప్పటికీ జిల్లా యంత్రాంగం సకాలంలో స్పందించి గర్భిణిని సురక్షితంగా ఆసుపత్రికి తరలించింది. దీంతో సుందరమ్మ పండంటి మగబిడ్డకు జన్మనిచ్చారు. తల్లీబిడ్డ ఇద్దరూ క్షేమంగా ఉన్నారు. గూడెంకొత్తవీధి మండలం పెట్రాయి గ్రామానికి చెందిన సుందరమ్మకు ప్రసవ వేదన రావడంతో, ఆమెను దారకొండ పీహెచ్‌సీకి తరలించాల్సి వచ్చింది. అయితే భారీ వర్షాలు, రహదారి తెగిపోవడంతో అంబులెన్స్ సాధారణ మార్గంలో వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. విషయం జిల్లా కలెక్టర్ టి. నిశాంతి దృష్టికి చేరడంతో వెంటనే స్పందించి, ప్రత్యామ్నాయ మార్గంలో గర్భిణిని తరలించాలని తహసీల్దార్ హెచ్ అన్నాజీ రావు మరియు అధికారులను ఆదేశించారు. అధికారుల సూచనతో ఒడిశా సరిహద్దులోని చిత్రకొండ మార్గం ద్వారా తరలింపు చేపట్టారు. మార్గమధ్యంలో కాట్రగెడ్డ వాగు అడ్డంకిగా మారినప్పటికీ ఎస్‌డీఆర్‌ఎఫ్, వైద్య, రెవెన్యూ సిబ్బంది సమన్వయంతో గర్భిణిని వాగు దాటించి అంబులెన్స్ వద్దకు చేర్చారు. అనంతరం దారకొండ పీహెచ్‌సీకి సురక్షితంగా తరలించారు. పీహెచ్‌సీలో వైద్యులు సకాలంలో వైద్యం అందించడంతో సుందరమ్మ సురక్షితంగా మగబిడ్డకు జన్మనిచ్చారు. ఈ మొత్తం ప్రక్రియను జిల్లా కలెక్టర్ టి. నిశాంతి, ఐటీడీఏ పీవో ఆదిత్య వర్మ పర్యవేక్షించారు. అత్యవసర పరిస్థితుల్లో సమన్వయంతో పనిచేసిన ఎస్‌డీఆర్‌ఎఫ్, వైద్య, రెవెన్యూ, అంబులెన్స్ సిబ్బందిని కలెక్టర్ అభినందించారు.

## హుకుంపేట తుఫాన్ కారణంగా దెబ్బతిన్న ఇల్లు మరియు దేవాలయాలు



**హుకుంపేట పెన్ పవర్ సెప్టెంబర్ 25 :** అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండల కేంద్రంలో ఇటీవల నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కారణంగా ముస్లిం సోదరుల మసీద్ ప్రమాదం పొంచి ఉంది మరియు పెట్రోల్ బంక్ ముందు వైస్ ప్రెసిడెంట్ కోడిదాస్.గోవింద్ ఇంటిముందు డ్రైనేజ్ పూర్తిగా మూతపడడంతో వరద నీరు ఇంటి లోపల, మరియు రోడ్డుపైకి రావడంతో ప్రజలంతా తీవ్రంగా ఇబ్బంది గురి అవుతున్నారు దయచేసి పంచాయతీ అధికారులు రెవెన్యూ సిబ్బంది పై అధికారుల యంత్రాంగం ఈ సమస్యలను పరిష్కరించే విధంగా చూడాలని కోరుకుంటున్నాము అలాగే హుకుంపేట పరిసర ప్రాంతాలలో ఇల్లులు ఏమైనా కూలిపోవడం పొలాలు నష్టపోవడం, వృక్షాలు విరిగిపోవడం వంటి సమస్యలపై దృష్టి పెట్టడమైనది చిన్నచిన్న సమస్యలు ఏమైనా ఉందా అని తనిఖీ చేయడమైనది అలాగే హుకుంపేట మండల కేంద్రంలో మేము పంట పొలాలు ఇల్లు రోడ్లు అన్నీ కూడా తనిఖీలు చేయడమైనది అందుకు ఎమ్మార్వో గారు వ్యవసాయ శాఖ అధికారి పంచాయతీ సెక్రటరీ సంబంధిత సిబ్బందితో వివరించడం జరిగింది పంట పొలాలు,గృహాలు,నష్టపోయిన వాళ్ళకి నష్టపరహారం చెల్లించాలని కోరడమైనది అందుకు ఈ యొక్క కార్యక్రమంలో టిడిపి నాయకులు అరకు అసెంబ్లీ ఐటీడీపీ అధ్యక్షులు జన్ని.వెంకటరమణ,. గ్రామ కంఠ అధ్యక్షులు దలాయి.లక్ష్మీనారాయణ, సమ్మరెడ్డి కొండలరావు హుకుంపేట మండల జనసేన కోర్ కమిటీ సభ్యులు మజ్జి. రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు పాల్గొనారు

# వర్ష బాధితులకు వైఎస్సార్‌సీపీ నాయకుల సహాయం

**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 25:** గూడెంకొత్తవీధి పంచాయతీ పరిధిలోని లంకపాకల గ్రామంలో భారీ వర్షాలకు ఇల్లు దెబ్బతిని నష్టపోయిన మహిళను, అలాగే లక్కవరపేట పంచాయతీ పరిధిలోని లక్కవరపేట గ్రామంలో భారీ వర్షాలకు ఇల్లు శిథిలమైన కుటుంబాలను వైఎస్సార్‌సీపీ నాయకులు పరామర్శించారు. బాధితులకు నిత్యావసర వస్తువులతో కూడిన సహాయ సామగ్రిని అందజేసి అండగా నిలిచారు. బాధిత కుటుంబాల సమస్యలను తెలుసుకుని ధైర్యం చెప్పిన నాయకులు, ప్రకృతి విపత్తుల సమయంలో ప్రతి ఒక్కరూ బాధితులకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. సహాయం అందించిన నాయకులకు బాధిత కుటుంబాలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగ కార్యదర్శి బొబ్బిలి లక్ష్మణ్, వైసిపి మండల ఉపాధ్యక్షులు వి. అరుణ్‌కుమార్,లకవరపేట మాజీ సర్పంచ్ వీరేంద్ర ప్రసాద్, వైసిపి నాయకులు అంజి,నూకరాజు, శ్రీకాంత్, రాజారావు, రామారావుతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.



# తుఫాను ప్రభావంతో ఇల్లు కోల్పోయిన వారికి శాశ్వత గృహాలు నిర్మించాలి.

- పంటలు కోల్పోయిన రైతులకు తక్షణ సహాయం అందించాలి.
- తాజా మాజీ ఎంపీపీ అనూష దేవి, జడ్పిటిసి బాలయ్య.

**చింతపల్లి పెన్ పవర్ సెప్టెంబర్ 25.** తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో ఇళ్లను కోల్పోయిన గిరిజనులకు శాశ్వత గృహాలను నిర్మించాలని తాజా మాజీ ఎంపీపీ కోరాబు అనూష దేవి, జడ్పిటిసి పోతురాజు బాలయ్య ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం వారు చౌడుపల్లి పంచాయతీ తాజా మాజీ సర్పంచ్ గెమ్మిలి లలిత తో కలిసి పలు గ్రామాలను పర్యటించారు. తుఫాను కారణంగా గృహాలు కోల్పోయిన బాధితులను వారు పరామర్శించి నిత్యవసర సరుకులను అందజేశారు. సత్యవరం గ్రామానికి చెందిన గె మ్మెలు గోపాలరావు, గంజి గడ్డ గ్రామానికి చెందిన జి జగన్నాథం, చదలపాడు గ్రామానికి చెందిన గొల్లూరి కృష్ణారావు, సేందేరి సన్యాసిరావు, సిందేరి కన్నబాబు, సిందేరి రంభ మొదలగు ఏడు కుటుంబాలకు నిత్యవసర సరుకులను అందజేసి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తుఫాన్ కారణంగా ఇళ్లను కోల్పోయిన వారికి ప్రభుత్వం శాశ్వత గృహాలు మంజూరు చేయాలని కోరారు. అలాగే తుఫాన్ కారణంగా పంటలు కోల్పోయిన గిరి రైతులకు తక్షణ సహాయం అందించి ఆదుకోవాలని వారు కోరారు. తుఫాను ప్రభావంతో 17 పంచాయితీలలో అపారమైన నష్టం జరిగిందని వారు అన్నారు. చింతపల్లి మండలాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. అతివృష్టి, అనావృష్టి వల్ల గిరిజన రైతాంగం సర్వస్వాన్ని కోల్పోయారని ఈ తరుణంలో రైతులను ఆదుకునే



బాధ్యత ప్రభుత్వంపై ఉందని వారన్నారు తుఫాన్ కారణంగా పారిశుధ్యం మెరుగుపరిచి ఎటువంటి అంటురోగాలు ప్రబలకుండా ఆరోగ్య సిబ్బంది అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. మారుమూల గ్రామాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం వాటిల్లకుండా తగు చర్యలు చేపట్టాలని విద్యుత్ శాఖ అధికారులను కోరారు. తుఫాను ప్రభావంతో సర్వస్వాన్ని కోల్పోయిన కుటుంబాలను గుర్తించి కలెక్టర్ వెంటనే స్పందించి ఆర్థిక సహాయంతో పాటు పునరావాస సదుపాయాలు కల్పించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి భూసరి కృష్ణారావు, చౌడుపల్లి సీనియర్ నాయకులు గెమ్మెలి సింహాచలం, కోరాబు కరుణానిధి, మండల యువ నాయకుడు చంటి,సత్య వరం వైఎస్ఆర్ నాయకులు ఆనంద్ మూడు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

# నేలమట్టమైన గృహాలు - బాధితుల కన్నీలు

- బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి కోవాలి.
- వైసిపి నేతలు జనం తిరుపతి, వంతాల సాదూరం.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, సెప్టెంబరు 25.** ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలో గల పనసపుట్టు పంచాయితీ, గిద్దులపుట్టు గ్రామానికి చెందిన తమర్భ దేవి, తమర్భ భాగ్యవతిలా ఇంటి గోడలు నేలమట్టమైనట్లు వైసిపి నాయకుడు జనం తిరుపతి తెలిపారు. అదేవిధంగా లక్ష్మీపురం పంచాయతీ, తుమ్మిడిపుట్టు గ్రామంలో బురిడీ అప్పారావు గృహము యొక్క గోడలు నేలకొరిగినట్లు వైసిపి నేత వంతాల సాధురం తెలిపారు. అదేవిధంగా ఏనుగురాయి పంచాయతీ, చోటా ముక్కిపుట్టు గ్రామానికి చెందిన వంతాల కాంతమ్మ యొక్క ఇంటి గోడలు వర్షానికి ధ్వంసమైనట్లు టిడిపి నేత మజ్జి చిన్ని తెలిపారు. అకాల వర్షాల వల్ల రైతన్నలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందనీ, ప్రజలు ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని నాయకులు సూచించారు. భారీ వర్షాలకు నిరాశ్రయులైన కుటుంబాలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

# దేశభక్తి భావనతో నిండిపోయిన చింతపల్లి.

- మండల కేంద్రంలో మార్మోగిన 'వందేమాతరం'.
- ఏకకంఠంతో గీతాన్ని ఆలపించిన 2,096 మంది విద్యార్థులు.

**చింతపల్లి పెన్ పవర్ సెప్టెంబర్ 25.** చింతపల్లి మండల కేంద్రం శుక్రవారం దేశభక్తి భావనతో పులకించిపోయింది. జాతీయ చైతన్యానికి ప్రతీకగా నిలిచిన 'వందేమాతరం' గీతం ఆవిర్భవించి 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని ఏకకాలంలో వేలాది గొంతులు మాతృభూమికి నీరాజనాలు అర్పించాయి. న్యూఢిల్లీలోని విద్యాభారతి అఖిల భారతీయ శిక్షా సంస్థాన్ ప్రేరణతో, స్థానిక భారతీయ విద్యా కేంద్రం (బి.వి.కె) విజ్ఞాన భారతి పాఠశాల ఆధ్వర్యంలో ఉదయం 11 గంటలకు సంపూర్ణ సామూహిక వందేమాతరం గాన కార్యక్రమాన్ని కన్నులపండువగా నిర్వహించారు. ఈ బృహత్తర కార్యక్రమంలో చింతపల్లి, రింతాడ పరిసర ప్రాంతాల్లోని పలు విద్యాసంస్థలకు చెందిన 2,096 మంది విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు అత్యుత్సాహంగా పాల్గొన్నారు. స్థానిక జీటీడబ్ల్యూఏ బాలికల పాఠశాల నుంచి 590 మంది, ఒకటో నంబర్ బాలుర పాఠశాల నుంచి 460 మంది, రెండో నంబర్ బాలుర పాఠశాల నుంచి 148 మంది, ఏపీఆర్ జూనియర్ కళాశాలకు చెందిన 202 మంది, అలాగే రింతాడ జీటీడబ్ల్యూఏ బాలికల పాఠశాల నుంచి అత్యధికంగా 694 మంది విద్యార్థులు ఏకకంఠంతో వందేమాతరాన్ని ఆలపించారు. వేలాది మంది విద్యార్థులు ఒకేసారి గొంతు కలపడంతో ఆ ప్రాంతమంతా జాతీయ భావంతో మార్మోగింది. ఈ సందర్భంగా వందేమాతరం గీత ప్రాశస్త్యాన్ని ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. వందేమాతరం అనేది




కేవలం పదాల సమాహారం కాదని, అది భారతీయ జాతీయ చైతన్యానికి అమర కంఠస్వరమని కొనియాడారు. మాతృభూమి పట్ల భక్తికి, ఆత్మగౌరవానికి, అంకితభావానికి ఇది ఒక శాశ్వత మంత్రం లాంటిదని పేర్కొన్నారు. స్వాతంత్ర్య పోరాటంలోని ప్రతి దశలోనూ అన్యాయాన్ని ఎదిరించి నిలబడటానికి, ప్రాణత్యాగాలకు వెరవకుండా పోరాడటానికి లక్షలాది మంది దేశభక్తులకు ఈ గీతం ఎలా స్ఫూర్తినిచ్చిందో సవివరంగా తెలియజేశారు. అనంతరం విజ్ఞాన భారతి పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.వెంకటేష్ మాట్లాడుతూ.. వందేమాతరం గీతం ఆవిర్భవించి 150 వసంతాలు పూర్తయిన తరుణంలో దేశవ్యాప్తంగా కోట్లాది గొంతులు ఒక్కటై ఈ గీతాన్ని సామూహికంగా, సంపూర్ణంగా ఆలపించాలన్నారు. ప్రతి ఒక్కరూ ఈ మహోన్నతమైన కార్యక్రమంలో భాగస్వాములై, మన దేశభక్తిని ప్రపంచ నలుమూలలా తెలిసేలా చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# నమామి భారతం - వందేమాతరం" సామూహిక గానం...!




**కొయ్యూరు,పెన్ పవర్ సెప్టెంబర్ 25:** విద్యాభారతి – అఖిల భారతీయ శిక్షా సంస్థాన్, న్యూఢిల్లీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న "నమామి భారతం – వందేమాతరం సామూహిక గాన" కార్యక్రమం మండలంలో ఘనంగా నిర్వహించారు.

భాద్రపద శుక్ల పక్ష చతుర్దశి, శుక్రవారం ఉదయం 11 గంటలనుండి స్థానిక గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల బాయ్స్ -వన్ లో కొయ్యూరు విజ్ఞాన భారతి ఆఫ్ బివికే ప్లే స్కూల్ కస్పాండెంట్ మేడి బోయిన చక్రరావు (చిన్న) ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా భరతమాత , సరస్వతి దేవి ల చిత్రపటాలకు పూలమాలవేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులంతా ఒకే గొంతుకతో వందేమాతరం గీతాన్ని ఆలపించారు.

ఈకార్యక్రమాన్ని ఉద్దేశించి ముఖ్య అతిథిగా విచ్చేసిన కొయ్యురు సీఐ- బి. శ్రీనివాసరావు మాట్లాడుతూ... భరతమాత గొప్పతనాన్ని, వందేమాతరం గీతం వెనుక ఉన్న చరిత్రను, స్వాతంత్ర్య ఉద్యమంలో దాని పాత్రను విద్యార్థులకు వివరించారు. దేశభక్తి, జాతీయ భావం విద్యార్థుల్లో చిన్నతనం నుండే పెంపొందించాలనే ఉద్దేశంతోనే విద్యాభారతి ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. పాఠశాల కరస్పాండెంట్ మేడిబోయిన చకర్రావు (చిన్న ) మాట్లాడుతూ...అంత్యోదయం అంటే సమాజంలోని చివరి వ్యక్తి అభ్యున్నతిని సాధించడం. మనిషి అభివృద్ధి కేవలం ఆర్థికంగా కాదు... శరీరం,మనసు, ఆత్మ సమగ్రంగా జరగాలి. రాజకీయాల అంతిమ లక్ష్యం అధికారం కాదు, సమాజంలోని ప్రతి వ్యక్తి సంక్షేమం. భారతీయ సంస్కృతిలో వ్యక్తి కాదు.. సమాజమే కేంద్ర బిందువు. అనే నినాదంతో పండిట్ దీన్ దయాళ్ జీ జీవించారన్నారు. ఆయన ఆశయాలను కొనసాగించవలసిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు.

కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుర్ల అనంతలక్ష్మి, పాఠశాల ఉపాధ్యాయురాలు సావిత్రి, ప్రధానోపాధ్యాయులు సిహెచ్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు అంబటి రాంబాబు, అప్పలకొండ, శివ ప్రసాద్, రాజకుమారి, వరలక్ష్మి, సుశీల, విద్యాభారతి ప్రతినిధులు, విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలోపాల్గొన్నారు.

# కలకళలాడుతున్న... జలాశయాలు...!

మండల ఇంజనీరింగ్ ఎస్ఎంఐ జేఈ రామకృష్ణ వెల్లడి




**కొయ్యూరు, పెన్ పవర్ సెప్టెంబర్ 25:** తుఫాన్ ప్రభావంతో గత నాలుగు రోజులుగా కురిసిన వర్షాల కారణంగా మండలంలోని ఉన్న వివిధ జలాశయాలు కళకళలాడుతున్నాయని మండల ఇంజనీరింగ్ జేఈ రామకృష్ణ తెలిపారు. శుక్రవారం ఆయన ములకలపాడు, గింజర్తి, లుబర్తి జలాశయాలను సందర్శించి పరిశీలించారు. ఇప్పటివరకు జరాశయాలు ఎటువంటి ప్రమాదం తావు లేకుండా నిండుకుండల కళకళలాడుతున్నాయని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా జరాశయాలు ఉధృతంగా ప్రవహించడం వల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. కాగా జలాశయాల వద్ద ఉన్న నీటి మట్టాన్ని బట్టి భవిష్యత్తులో రైతులకు సాగునీరు అందించే మరిన్ని మరిన్ని సాధ్యాసాధ్యాలు అంచనా వేసినట్లు జేఈ రామకృష్ణ తెలిపారు.ఽ

# జిల్లా ఉషూ పోటీల్లో నర్సీపట్నం క్రీడాకారుల సత్తా

- 12 స్వర్ణాలు, 4 రజత పతకాలు కైవసం
- రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



**నర్సీపట్నం, పెన్ పవర్ (సెప్టెంబర్ 25) :** అనకాపల్లి జిల్లా స్థాయి ఉషూ పోటీల్లో నర్సీపట్నం నియోజకవర్గానికి చెందిన క్రీడాకారులు ప్రతిభ చాటారు. అనకాపల్లిలోని కేఎస్ఆర్ స్పోర్ట్స్ అకాడమీలో జిల్లా ఉషూ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సీనియర్, జూనియర్ మెన్ అండ్ విమెన్ ఉషూ పోటీల్లో నర్సీపట్నం నియోజకవర్గం నుంచి పాల్గొన్న క్రీడాకారులు మొత్తం 12 స్వర్ణ, 4 రజత పతకాలు సాధించారు. మాకవరపాలెంలోని అవంతి ఇంజినీరింగ్ కళాశాల నుంచి ఎనిమిది మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొనగా, వారిలో ఏడుగురు స్వర్ణ పతకాలు సాధించడం విశేషం. కోచ్ వేపాడ ప్రియాంక శిక్షణలో క్రీడాకారులు ఈ విజయాలను సాధించారు.

విజేతలకు జిల్లా ఉషూ అసోసియేషన్ అధ్యక్షుడు కే. సత్యనారాయణ, కార్యదర్శి వెంకట్ సర్టిఫికెట్లు, మెడల్స్, బహుమతులు అందజేసి అభినందించారు. జిల్లా స్థాయి పోటీల్లో స్వర్ణ పతకాలు సాధించిన క్రీడాకారులు ఈ నెల 29, 30 తేదీల్లో రాజమండ్రిలో జరగనున్న రాష్ట్రస్థాయి సీనియర్, జూనియర్ ఉషూ టోర్నమెంట్‌లో పాల్గొననున్నారు. క్రీడాకారులకు ప్రభుత్వం అమలు చేస్తున్న 3 శాతం స్పోర్ట్స్ కోటా ద్వారా ఉద్యోగావకాశాలు పొందడంతో పాటు ఇంజినీరింగ్, ఐటీ, నీట్ తదితర ఉన్నత విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు క్రీడా ప్రతిభ ఎంతో ఉపయోగపడుతుందని శాప్ కోచ్ అబ్బు తెలిపారు. క్రీడాకారులు రాష్ట్రస్థాయిలోనూ రాణించి నర్సీపట్నం నియోజకవర్గానికి మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు.

# పశు వైద్యాధికారులు గ్రామాల పర్యటన



మండలంలో భారీ వర్షాల ప్రభావంపై క్షేత్రస్థాయి పరిశీలన.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, సెప్టెంబరు 25.** ఎడతెరిపిలేని వర్షాలు కారణంగా పశువుల సంరక్షణకై తీసుకోవాల్సిన జాగ్రత్తలు గూర్చి అవగాహన కల్పిస్తూ ముంచంగిపుట్టు మండల వ్యాప్తంగా పశు వైద్యాధికారులు గ్రామాలలో పర్యటిస్తున్నారు. శుక్రవారం కొండపడ మరియు సెలుమ్ పుట్టు గ్రామాల్లో డాక్టర్ ప్రదీప్ కుమార్ తన బృందంతో క్షేత్రస్థాయి పర్యటన చేసి భారీ వర్షాల కారణంగా పశు సంపదపై ఏర్పడిన ప్రభావాన్ని పరిశీలించారు. స్థానిక రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పశువుల ఆరోగ్య పరిస్థితి, సంరక్షణ మరియు భారీ వర్షాల కారణంగా పశు పోషకులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై వివరాలను సేకరించారు. పశు సంరక్షణకై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డా. జ్యోతి స్వరూపతో పాటు పశు సంవర్ధక శాఖ సహాయకులు రమేష్, వెంకట్ పాల్గొన్నారు.

# అంత్యోదయమే లక్ష్యం.. సమాజ సేవే సంకల్పం.




- మండలంలో ఘనంగా దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలు.
- పాల్గొన్న రాష్ట్ర ట్రైకార్ డైరెక్టర్ కృష్ణారావు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రభాకర్.

**చింతపల్లి పెన్ పవర్ సెప్టెంబర్ 25.** భారతీయ జనసంఘ్ మహానేత, ఏకాత్మ మానవతావాద సిద్ధాంతకర్త పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలను శుక్రవారం మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు కొత్తపాలెం పంచాయతీ పెద్దపాకల గ్రామంలో బీజేపీ శ్రేణులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా అంజలి ఘటించారు. సమాజంలోని అట్టడుగు వర్గాల అభ్యున్నతి, అంత్యోదయ స్ఫూర్తి కోసం ఆయన చేసిన విశేష కృషిని నాయకులు, కార్యకర్తలు స్మరించుకున్నారు. అందులో భాగంగా కొత్తపాలెం పంచాయతీ పెద్దపాకల గ్రామంలో బీజేపీ చింతపల్లి మండల అధ్యక్షుడు సాగిన బాలకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఏపీ రాష్ట్ర ట్రైకార్ డైరెక్టర్ కూడ కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో అట్టడుగున ఉన్న చివరి వ్యక్తి అభివృద్ధికి నోచుకున్నప్పుడే నిజమైన సార్వభౌమాధికారానికి అర్థం ఉంటుందని, అదే దీనదయాళ్ కలలుగన్న 'అంత్యోదయ' అని పేర్కొన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ వేడుకలో మండల గిరిజన మోర్చా అధ్యక్షుడు వంతరి చిన్నారావు, కిసాన్ మోర్చా మండల ప్రధాన కార్యదర్శులు కీముడు లక్ష్మణరావు, పొటుకూరి బాలరాజు, జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు బొబ్బిలి రమణలతో పాటు స్థానిక నాయకులు కొర్ర సుబ్బారావు, గెమ్మెలి బాబురావు, పాంగి నాగేష్, కిలో కనకారావు, సాగర్, చిరంజీవి, సాగిన దావీదు, వెంకటేశ్వర్లు, గణపతి, ఉల్లి పౌల్ రాజు, కొండబాబు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అదే క్రమంలో చింతపల్లి మండల కేంద్రంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు జైతి ప్రభాకర్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దీనదయాళ్ ప్రతిపాదించిన ఏకాత్మ మానవతావాదం, అంత్యోదయ భావన సమాజంలోని ప్రతి ఒక్కరి సంక్షేమాన్ని లక్ష్యంగా చేసుకున్నాయని కొనియాడారు. ఆ మహానేత ఆశయాలను, సిద్ధాంతాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు ప్రతి కార్యకర్త నిరంతరం కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఐటీ కన్వీనర్ పంద ఈశ్వర్ రావు, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు కదుల్ల శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు వసుపరి శ్రీనివాస్, మండల యువ మోర్చా అధ్యక్షులు దేపూరి సోమలింగం, మండల కార్యదర్శి మాతే లక్ష్మణ రావు తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# కొయ్యూరు నూతన ఐసిడిఎస్ సిడిపిఓ గా సత్య శ్రీ...!



**కొయ్యూరు,పెన్ పవర్ సెప్టెంబర్ 25:** కొయ్యూరు ఐసిడిఎస్ నూతన సిడిపిఓ గా ఎం.వి. కె. సత్య శ్రీ నియమితులయ్యారు. ఇక్కడ పనిచేసిన సిడిపిఓ ఎల్ దేవామణి బదిలీపై మన్యం జిల్లా కురుపాం బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో సత్య శ్రీ పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... శ్రీకాకుళం జిల్లా ఆముదాల వలస నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చానని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా అన్నివేళలా అందుబాటులో ఉండి అంగన్వాడీ అభివృద్ధికి పాటుపడుతానని ఆమె తెలిపారు. సిడిపిఓ ను ఐసిడిఎస్ సిబ్బంది సాదరంగా ఆహ్వానించి శుభాకాంక్షలు తెలిపారు.

## ఇల్లు కూలిన కుటుంబానికి కూటమి నాయకుల అండ



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 25**: గూడెంకొత్తవీధి మండలం లంకపాకలు గ్రామంలో భారీ వర్షాలకు ఇల్లు కూలిపోయిన బాధిత కుటుంబాన్ని కూటమి నాయకులు పరామర్శించారు. ఇల్లు కూలిపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబానికి ధైర్యం చెప్పి, నిత్యావసర సరుకులను అందజేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని, వర్షాల కారణంగా నష్టపోయిన కుటుంబాలకు ప్రభుత్వం నుంచి అవసరమైన సహాయం అందేలా కృషి చేస్తామని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో జనసేన అరకు పార్లమెంట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గొర్లె వీర వెంకట్, టీడీపీ ప్రధాన కార్యదర్శి పసుపులేటి నాగమణి, టీడీపీ సీనియర్ నాయకులు కొర్ర బలరాం, జనసేన నాయకులు గడుతూరి పరమేష్, కొయ్యం ఇమ్మానుయేల్, సిద్ధు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## కొత్తవాడలో కొట్టుకుపోయిన కల్వర్టు.. తక్షణమే పునర్నిర్మించాలని డిమాండ్



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 25**:గూడెంకొత్తవీధి మండలం మొండిగడ్డ పంచాయతీ పరిధిలోని కొత్తవాడ గ్రామంలో భారీ వర్షాలకు కల్వర్టు కొట్టుకుపోయింది. దీంతో గ్రామస్తులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో ఎంపీపీ నిధులతో నిర్మించిన కల్వర్టు వర్షాలకు కొట్టుకుపోవడంతో గ్రామానికి రాకపోకలు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇక ఆలస్యం చేయకుండా వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి, శాశ్వత ప్రాతిపదికన కల్వర్టును పునర్నిర్మించేందుకు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. తాత్కాలిక ఏర్పాట్లతో సమస్యను వాయిదా వేయకుండా, రాకపోకలకు శాశ్వత పరిష్కారం కల్పించాలని కోరుతున్నారు.

## పనసపల్లిలో కొట్టుకుపోయిన కల్వర్టును పరిశీలించిన కూటమి నాయకులు



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 25:** గూడెంకొత్తవీధి పంచాయతీ పరిధిలోని పనసపల్లి గ్రామంలో భారీ వర్షాలకు కొట్టుకుపోయిన కల్వర్టును కూటమి నాయకులు పరిశీలించారు. జనసేన అరకు పార్లమెంట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గొర్లె వీర వెంకట్ ఆధ్వర్యంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి పసుపులేటి నాగమణి, టీడీపీ సీనియర్ నాయకులు కొర్ర బలరాంతో కలిసి గ్రామాన్ని సందర్శించారు. కల్వర్టు కొట్టుకుపోవడంతో గ్రామస్తులు ఎదుర్కొంటున్న రాకపోకల ఇబ్బందులను నాయకులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత అధికారులతో మాట్లాడి కల్వర్టు సమస్యను వెంటనే పరిష్కరించి, గ్రామస్తులకు రాకపోకలు సులభతరం చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ పర్యటనలో కూటమి నాయకులు గడుతూరి పరమేష్, కొయ్యం ఇమ్మానుయేల్ (సిద్ధు), శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షాలకు కొట్టుకుపోయిన కల్వర్టు

**పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు.. తక్షణమే పునరుద్ధరించాలని డిమాండ్**



**అరకులోయ పెన్ పవర్ సెప్టెంబర్ 25:** అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు వేలి మండలం బస్కి పంచాయతీ పరిధిలోని గిర్లిగూడ నుంచి డుంబ్రిగూడ మండలం కితలంగి పంచాయతీ పరశీల గ్రామానికి వెళ్లే మార్గంలో నిర్మించిన తాత్కాలిక కల్వర్టు భారీ వర్షాలకు కొట్టుకుపోయింది. గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో కల్వర్టు దెబ్బతినడంతో ఈ మార్గంలో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో ఉద్యోగులు, విద్యార్థులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయంపై బస్కి మాజీ ఎంపీటీసీ బురిడీ దశరథ్ మాట్లాడుతూ.. రహదారి పనులు సకాలంలో పూర్తికాకపోవడంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. కల్వర్టును వెంటనే పునరుద్ధరించి రాకపోకలు కొనసాగించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమస్యను పరిష్కరించకపోతే గ్రామస్తులతో కలిసి ధర్నా చేపడతామని హెచ్చరించారు.

# గురుకులంలో విద్యార్థులకు పోలీసుల అవగాహన సదస్సు

**విద్యార్థులకు డ్రగ్స్, సైబర్ నేరాలు,శాంతిభద్రతలపై దిశానిర్దేశం చేసిన ఎస్సై కృష్ణ**

**విశాఖ తూర్పు ,పెన్ పవర్, సెప్టెంబర్ 25:** అరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలోని క్రిష్ణాపురం లో గల అంబేద్కర్ గురుకుల పాఠశాలలో బుధవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అరిలోవ ఎస్సై కృష్ణ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు నేటి సమాజంలో పొంచి ఉన్న ముప్పుపై వివరంగా తెలియజేశారు.

ఈ సందర్భంగా ఎస్సై కృష్ణ మాట్లాడుతూ...మత్తుకు బానిస కావద్దు – డ్రగ్స్ వద్దు:

యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడి తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గంజాయి, డ్రగ్స్ సేవిస్తే జీవితం నాశనమవుతుందని, అలాంటి వారి వివరాలు తెలిస్తే వెంటనే 100 కు లేదా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

**. సైబర్ నేరాల పట్ల అప్రమత్తత:**

సెల్ ఫోన్ వాడకంలో జాగ్రత్తగా ఉండాలని, తెలియని లింకులు క్లిక్ చేయవద్దని, ఓటీపీలు ఎవరికీ చెప్పవద్దని సూచించారు. సోషల్ మీడియాలో అపరిచిత వ్యక్తులతో చాటింగ్ చేయడం, వారికి ఫోటోలు పంపడం వల్ల ఎన్నో ఇబ్బందులు ఎదురవుతాయని హెచ్చరించారు. ఏదైనా సైబర్ మోసం జరిగితే వెంటనే 1930 కు కాల్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గురుకుల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులకు ఈ అవగాహన కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా ఉందని ఉపాధ్యాయులు పోలీస్ శాఖకు కృతజ్ఞతలు తెలిపారు.



# క్షణికావేశంతో జీవితాలను నాశనం చేసుకోవద్దు.




- జీవితం ఎంతో విలువైనది.
- విద్యార్థినులకు ఉమెన్ సేఫ్టీ సెల్ డీఎస్పీ వేణుగోపాలరావు హితవు.
- చింతపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మహిళా భద్రతపై అవగాహన సదస్సు.

**చింతపల్లి పెన్ పవర్ సెప్టెంబర్ 25.** యుక్తవయసులో క్షణికాకర్షణలకు లోనై, స్నేహాలు లేదా ఇతర కారణాలతో ఇల్లు వదిలి వెళితే భవిష్యత్తు అంధకారమవుతుందని ఉమెన్ సేఫ్టీ సెల్ డీఎస్పీ వేణుగోపాలరావు విద్యార్థినులను ఉద్దేశించి అన్నారు. అల్లూరి జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం చింతపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 'మహిళా భద్రత'పై ప్రత్యేక అవగాహన సదస్సును నిర్వహించారు. స్థానిక సీఐ బి. సింహాచలంతో కలిసి ముఖ్యఅతిథిగా హాజరైన డీఎస్పీ వేణుగోపాలరావు విద్యార్థినులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ వయసులో విద్యార్థినులు తమ దృష్టిని కేవలం చదువు, భవిష్యత్తును తీర్చిదిద్దుకోవడంపైనే ఉంచాలని డీఎస్పీ సూచించారు. కుటుంబాన్ని కాదని బయటకు వెళితే ఎలాంటి చదువు, ఉద్యోగం, డబ్బు లేకుండా సమాజంలో బతకడం చాలా కష్టమన్నారు. ఇంటి నుంచి బయటకు వెళ్లిన నాలుగైదు రోజుల్లోనే వాస్తవ పరిస్థితులు, తల్లిదండ్రుల ప్రేమ విలువ అర్థమవుతాయని ఆయన గుర్తుచేశారు. కొందరు మోసగాళ్లు మాయమాటలు చెప్పి తీసుకెళ్లి, డబ్బులు లాక్కొని నడిరోడ్డుపై వదిలేస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. బయటి సమాజం ఒక విషవలయం లాంటిదని, నేరస్థులు మహిళలను వాడుకుంటారని తెలిపారు. ముఖ్యంగా మహిళల అక్రమ రవాణా (ఉమెన్ ట్రాఫికింగ్), లైంగిక దోపిడీల పట్ల బాలికలు అప్రమత్తంగా ఉండాలని ఆయన హెచ్చరించారు. సోషల్ మీడియాలో అపరిచితులతో పరిచయాలు పెంచుకుని మోసపోవద్దని, సామాజిక మాధ్యమాల ప్రభావంతో యువత పెడదారిన పడుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సైబర్ నేరగాళ్లు నకిలీ ఖాతాలతో వల వేస్తారని, వ్యక్తిగత ఫొటోలు పంచుకుంటే మార్ఫింగ్ చేసి బ్లాక్‌మెయిల్‌కు పాల్పడే ప్రమాదం ఉన్నందున ఆన్‌లైన్ వినియోగంలో విద్యార్థినులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. బాల్య వివాహాల నిరోధక చట్టం గురించి ఆయన వివరిస్తూ.. 18 ఏళ్లు నిండని బాలికలకు వారి ఇష్టానికి వ్యతిరేకంగా కన్న తల్లిదండ్రులు వివాహం చేయాలని చూసినా అది చట్టరీత్యా నేరమేనని స్పష్టం చేశారు. ఇలాంటి పరిస్థితులు ఎదురైతే విద్యార్థినులు భయపడకుండా ధైర్యంగా ఎదిరించాలని పిలుపునిచ్చారు. మహిళలు, విద్యార్థినులు ఏ రకమైన ఆపదలో ఉన్నా తక్షణమే '112' టోల్ ఫ్రీ నంబర్‌కు డయల్ చేసి పోలీసుల సహాయం పొందవచ్చని డీఎస్పీ వివరించారు. లేదా గ్రామాల్లో అందుబాటులో ఉండే మహిళా సంరక్షణ కార్యదర్శులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కే. గోవిందరావు, ఇంగ్లీష్ అధ్యాపకులు ఈశ్వర్ బాబు నాయుడు, తెలుగు అధ్యాపకులు రాజంనాయుడు తదితరులతో పాటు అధిక సంఖ్యలో విద్యార్థినులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# శిథిల పాఠశాల గోడ కూలింది.. తప్పిన పెను ప్రమాదం



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 25:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలం దేవరపల్లి పంచాయతీ పరిధిలోని చీడిగొంది గ్రామంలో శిథిలావస్థకు చేరిన ఎంపీపీ ప్రాథమిక పాఠశాల భవనం గోడ శుక్రవారం ఉదయం ఒక్కసారిగా కూలిపోయింది. పాఠశాలకు సెలవు కావడంతో విద్యార్థులు భవనంలో లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. చీడిగొంది గ్రామంలో ప్రాథమిక పాఠశాల కోసం నిర్మించిన భవనం కొంతకాలంగా శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారిందని స్థానికులు తెలిపారు. భవనం పరిస్థితిపై పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పాఠశాలలో సుమారు 44 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. విద్యార్థులు పాఠశాలలో ఉన్న సమయంలో గోడ కూలి ఉంటే తీవ్ర ప్రమాదం జరిగి ఉండేదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాఠశాల భవనాన్ని తక్షణమే పరిశీలించి, ప్రమాదకరంగా ఉన్న నిర్మాణాన్ని తొలగించి విద్యార్థులకు సురక్షితమైన భవనం ఏర్పాటు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

# పిల్లల్లో రక్తహీనత తగ్గించడమే లక్ష్యం

- కొరవంగిలో జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం.
- కొరవంగి పాఠశాల విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు వేయించిన వైద్య సిబ్బంది.
- రూడకోట పీహెచ్సీ వైద్యాధికారిణి పర్వీన్.




**ముంచంగిపుట్టు, పెన్ పవర్, సెప్టెంబరు 25** .జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలోని కొరవంగి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను అందించినట్లు రూడకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి పర్వీన్ తెలిపారు. శుక్రవారం ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. పిల్లల్లో రక్తహీనతను తగ్గించడం, పోషకాహార లోపాన్ని నివారించడం మరియు ఎదుగుదలకు తోడ్పడటం నులిపురుగుల నివారణ దినోత్సవ ముఖ్య లక్ష్యం అన్నారు. సంవత్సరానికి రెండు సార్లు ఈ కార్యక్రమాన్ని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం నిర్వహిస్తుందని అన్నారు. అపరిశుభ్రత వల్ల నులిపురుగులు వస్తాయని, కాబట్టి చేతులను శుభ్రంగా ఉంచుకోవడం, గోర్లను కత్తిరించడం, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, మరియు వేడి చేసిన నీరు చల్లార్చి త్రాగాలని ఉపాధ్యాయులకు విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రోడొకట ఆరోగ్య కేంద్రం ఎంపిహెచ్ఈఓ రామారావు, హెచ్ వి సిహెచ్. భాగ్యలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ నాగరాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రచారాలపై పాస్టర్ జోసెఫ్ వివరణ.. ఆధారాలతో వాస్తవాలు వెల్లడిస్తానని ప్రకటన



**ఎస్.కోట/అరకులోయ పెన్ పవర్ సెప్టెంబర్ 25 :** తనపై ఇటీవల పత్రికలు, సోషల్ మీడియా వేదికల ద్వారా వస్తున్న ఆరోపణలు, ప్రచారాలు అవాస్తవమని ఎస్.కోట మండలం రేగ పుణ్యగిరి గ్రామానికి చెందిన పాస్టర్ జోసెఫ్ (ప్రసాద్ రావు) తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేసి తన వాదనను వెల్లడించారు. 2010 నుంచి రేగ పుణ్యగిరి గ్రామంలో నివాసముంటూ ప్రార్థనా కార్యక్రమాలతో పాటు గ్రామ ప్రజల్లో మద్యపానం, ఇతర వ్యసనాలు, మూఢనమ్మకాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆహారం, వస్త్రాలు, విద్య, వైద్యం తదితర అంశాల్లో తమ సంఘం తరపున సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామంలో 33 కుటుంబాలు ఉండగా, అందులో 30 కుటుంబాలు తమ ప్రార్థనా సంఘంతో కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. సంఘ సభ్యుల సహకారంతో 2016లో ప్రార్థనా మందిరం నిర్మాణం ప్రారంభించి 2022లో పూర్తి చేసినట్లు వివరించారు. అయితే ప్రార్థనా మందిరంపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ అదే గ్రామానికి చెందిన సీదరి అర్జున్ అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు పాస్టర్ తెలిపారు. అనంతరం అటవీశాఖ అధికారులు చట్టపరమైన అంశాలను తెలియజేసి ప్రార్థనా మందిరాన్ని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. మందిరం సీజ్‌లో ఉండటంతో సంఘ సభ్యులు తాత్కాలికంగా రేకుల షెడ్డు ఏర్పాటు చేసుకుని ప్రార్థనలు నిర్వహించేవారని, సెప్టెంబర్ 23 న మరోసారి ఫిర్యాదు రావడంతో ఆ షెడ్డు కూడా తొలగించినట్లు తెలిపారు. తమ ప్రార్థనా సంఘానికి వస్తున్న ప్రజలను కొందరు భయపెడుతున్నారని, తనపై వ్యక్తిగతంగా కూడా అసత్య ప్రచారాలు చేస్తున్నారని పాస్టర్ జోసెఫ్ ఆరోపించారు. గత 16 ఏళ్లుగా కష్టపడి కొనసాగిస్తున్న సంఘాన్ని దెబ్బతీసేందుకు తనపై వివిధ ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. తనపై వచ్చిన ఆరోపణలకు

# రామకృష్ణాపురంలో అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ యువనేత వెలగపూడి ప్రతాపరుద్ర

**విశాఖపట్నం, పెన్ పవర్, సెప్టెంబర్ 25:** జీవీఎంసీ విశాఖ తూర్పు నియోజకవర్గం 13వ వార్డు రామకృష్ణాపురం, శ్రీకృష్ణాపురం గ్రామాల్లో శ్రీశ్రీ వరసిద్ధి వినాయక నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా విశాఖ తూర్పు నియోజకవర్గ టీడీపీ యువ నాయకులు వెలగపూడి ప్రతాపరుద్ర. పాల్గొన్నారు. స్వామి దర్శనం అనంతరం అన్నదాన సమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారుఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వినాయక నవరాత్రి ఉత్సవాలు ప్రజల్లో భక్తిభావంతో పాటు ఐక్యతను,సేవా దృక్పథాన్ని పెంపొందిస్తాయని అన్నారు. అన్నదానం మహాదానమని, ఇటువంటి సేవా కార్యక్రమాల నిర్వహణకు ముందుకొచ్చిన ఉత్సవ కమిటీ సభ్యులు, యువతను ఆయన అభినందించారు.

ఈ కార్యక్రమంలో వార్డు టీడీపీ అధ్యక్షులు ఏడువాక సన్యాసిరావు,పొత్రకండ ధర్మారావు,తురకపూడి బాలస్వామి,మారిక జక్కన్న,తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా రవాణాలో మహిళల భద్రతకు 'అభయ క్యూఆర్ కోడ్'

**కొత్తకోటలో ఆర్టీసీ బస్సులు, ఆటోలు, క్యాబ్‌లకు స్టిక్కర్ల అతికింపు**

**మహిళలు, విద్యార్థినులకు సత్వర పోలీస్ సహాయం**



**కొత్తకోట (రావికమతం), సెప్టెంబర్ 25:** మహిళలు, విద్యార్థినుల భద్రతకు అధిక ప్రాధాన్యతనిస్తూ అనకాపల్లి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 'అభయ క్యూఆర్ కోడ్'పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ శ్రీ తుహిన్ సిన్హా, ఐపీఎస్ ఆదేశాల మేరకు రావికమతం మండలం కొత్తకోట పరిధిలో శుక్రవారం ప్రజా రవాణా వాహనాలకు 'అభయ క్యూఆర్ కోడ్' స్టిక్కర్లను అతికించి ప్రయాణికులకు అవగాహన కల్పించారు. కొత్తకోట సీఐ జి. కోటేశ్వరరావు, ఎస్సై శ్రీనివాస్, పోలీస్ మరియు మహిళా సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కొత్తకోట మీదుగా ప్రయాణించే ఆర్టీసీ బస్సులు, పాఠశాల, కళాశాల బస్సులు, ఆటోలు, మ్యాక్సీ క్యాబ్‌లు తదితర ప్రజా రవాణా వాహనాల్లో ప్రయాణికులకు స్పష్టంగా కనిపించేలా 'అభయ క్యూఆర్ కోడ్' స్టిక్కర్లను పోలీస్ అధికారులు అతికించారు. ప్రయాణ సమయంలో మహిళలు లేదా విద్యార్థినులు వేధింపులకు గురైనప్పుడు వాహనంలో ఉన్న 'అభయ క్యూఆర్ కోడ్'ను స్మార్ట్‌ఫోన్‌తో స్కాన్ చేసి సంఘటన వివరాలను నమోదు చేసి ఫిర్యాదు చేయవచ్చని పోలీసులు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో 112 వంటి సేవలను వినియోగించుకోవచ్చని సూచించారు. క్యూఆర్ కోడ్ ద్వారా అందే ఫిర్యాదును పోలీస్ వ్యవస్థకు చేరవేసి, వాహనం ప్రయాణిస్తున్న ప్రాంతాన్ని ఆధారంగా చేసుకుని సంబంధిత పోలీస్ సిబ్బందికి సమాచారం అందే విధంగా చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లు, క్యాబ్ డ్రైవర్లు, ఇతర ప్రజా రవాణా వాహనాల చోదకులతో పోలీసులు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. వాహనాల్లో ఏర్పాటు చేసిన 'అభయ క్యూఆర్ కోడ్' స్టిక్కర్లను తొలగించకుండా, ప్రయాణికులకు స్పష్టంగా కనిపించే విధంగా ఉంచాలని సూచించారు. మహిళలు, బాలికల పట్ల గౌరవంగా వ్యవహరించి, వారి సురక్షిత ప్రయాణానికి సహకరించాలని దిశానిర్దేశం చేశారు. ప్రజా రవాణా వాహనాల్లో మహిళలకు భద్రత, భరోసా కల్పించడంతో పాటు వేధింపులకు పాల్పడే వారిపై సత్వర చర్యలు తీసుకునేందుకు కోడ్' ఉపయోగపడుతుందని పోలీసులు తెలిపారు. మహిళలు, విద్యార్థినులు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# గోపాలపట్నంలో ఘనంగా వరసిద్ధి వినాయక చవితి వేడుకలు

- అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ యువనేత మౌర్యసింహా



**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, సెప్టెంబర్ 25 :** గోపాలపట్నం పరిధిలోని పలు ప్రాంతాల్లో శ్రీ శ్రీ శ్రీ వరసిద్ధి వినాయక చవితి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అన్నదాన కార్యక్రమాల్లో ప్రభుత్వ విప్, శాసనసభ్యులు పి.జి.వి.ఆర్. నాయుడు (గణబాబు) తనయుడు, టీడీపీ యువనేత మౌర్యసింహా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. వినాయకుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో 92వ వార్డు టీడీపీ ఇంచార్జ్ దాడి రమేష్ నాయుడు, నారిపిన్ని సత్తిరాజు, మూర్తి పట్నాయక్, ఆయతంశెట్టి గోపీ, కూటమి నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు. వినాయక చవితి సందర్భంగా నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమాలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

# ఎర్నిమాంబ దేవస్థానం పాలక మండలి సభ్యుడిగా కణితి గౌరీ రమేష్

జ్ఞానాపురంలో ఘనంగా ప్రమాణ స్వీకారం



**విశాఖపట్నం, పెన్ పవర్, సెప్టెంబర్ 25 :** విశాఖపట్నం జ్ఞానాపురంలో వెలసిన శ్రీ ఎర్నిమాంబ అమ్మవారి దేవస్థానం పాలక మండలి సభ్యుడిగా నాయి బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన జనసేన పార్టీ నాయకులు కణితి గౌరీ రమేష్ ప్రమాణ స్వీకారం చేశారు. దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా జరిగింది. ప్రమాణ స్వీకారం అనంతరం కణితి గౌరీ రమేష్‌ను నాయి బ్రాహ్మణ సంఘాల నాయకులు, సభ్యులు ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. దేవస్థానం పాలక మండలి సభ్యుడిగా బాధ్యతలు స్వీకరించడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ కోటా నరేష్, విశాఖ జిల్లా నాయి బ్రాహ్మణ సేవా సంఘం రిజి. నెం.500/82 అధ్యక్షులు కోడూరు గణపతిరావు, ప్రధాన కార్యదర్శి నరవ పైడిరాజు, అదనపు కోశాధికారి మల్లువలస వర్మ, అధికార ప్రతినిధి బల్లంకి వెంకట్రావు పాల్గొన్నారు. అలాగే విశాఖ పశ్చిమ నియోజకవర్గ అధ్యక్షులు గోల్కొండ కర్నాకర్, దక్షిణ నియోజకవర్గ అధ్యక్షులు చల్లపల్లి శ్రీనివాసరావు, కంచరపాలెం అధ్యక్షులు ఇప్పిలి మల్లేశ్వరరావు, డాబా గార్డెన్స్ అధ్యక్షులు గూడుపువలస సతీష్ తదితరులు పాల్గొన్నారు. నాయి బ్రాహ్మణ సంఘం నాయకులు గోలజాపు అప్పారావు, కస్స సాయిరాం, మల్లువలస రాధాకృష్ణ, తిడ సన్యాసిరావు, మల్లువలస వెంకటరమణ, ఆతవ లక్ష్మణరావు, కుమార కొండబాబు, ఆతవ అచ్యుతరావుతో పాటు పలువురు సంఘ సభ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయి బ్రాహ్మణ కమిటీ సభ్యులు మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ దేవస్థానాల పాలక మండళ్లలో నాయి బ్రాహ్మణులకు ప్రాతినిధ్యం కల్పిస్తున్నందుకు కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. దేవస్థానాల పాలక మండళ్లలో సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఎర్నిమాంబ అమ్మవారి దేవస్థానం అభివృద్ధి, భక్తులకు అవసరమైన సౌకర్యాల కల్పనతో పాటు దేవస్థానం ప్రతిష్ట మరింత పెరిగేలా పాలక మండలి సభ్యుడిగా తన వంతు కృషి చేస్తానని కణితి గౌరీ రమేష్ తెలిపారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన వారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం నాయి బ్రాహ్మణ సంఘాల నాయకులు, సభ్యుల సమక్షంలో ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది.

# 50 ఏళ్లు పూర్తి చేసుకున్న శోభన్ బాబు చిత్రం 'మొనగాడు'

- 'మొనగాడు' 50 ఏళ్ల సందర్భంగా ప్రత్యేక పుస్తకం
- శోభన్ బాబు పౌరాణిక, కుటుంబ కథా చిత్రాలకు ప్రత్యేక స్థానం
- నంది అవార్డుల్లో శోభన్ బాబు హ్యాట్రిక్
- సంఘం అధ్యక్షులు నందవరపు సోములు



**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, సెప్టెంబర్ 25 :**నటభూషణ శోభన్ బాబు నటించిన 'మొనగాడు' చిత్రం విడుదలై 50 వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా గోపాలపట్నంలో శోభన్ బాబు సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు నందవరపు సోములు మాట్లాడుతూ తల్లి--కొడుకుల అనుబంధం, అన్నాచెల్లెళ్ల ఆప్యాయత, అన్నదమ్ముల అనురాగం, ప్రేమ, కుటుంబ విలువలను చక్కగా ప్రతిబింబించిన చిత్రంగా 'మొనగాడు' ప్రేక్షకుల ఆదరణ పొందిందన్నారు. 'మొనగాడు' చిత్రంలో చిన్నప్పుడే తప్పిపోయిన బాలుడు చెడు మార్గంలో నడిచే వ్యక్తులతో కలిసినప్పుడు ఎదురయ్యే పరిణామాలను చక్కగా చూపించారని నందవరపు సోములు తెలిపారు. మంచి కథ, ఆకట్టుకునే సన్నివేశాలు, మధురమైన పాటలతో చిత్రం ప్రేక్షకులను అలరించిందన్నారు. 2006లో విడుదలైన 'ధూమ్-2' చిత్రంలోని కిరీటం దొంగతనం సన్నివేశాన్ని ఎంతో గొప్పగా చెప్పుకున్నారని నందవరపు సోములు పేర్కొన్నారు. అయితే దానికి దశాబ్దాల ముందే 'మొనగాడు' చిత్రంలో శోభన్ బాబు ఇలాంటి సన్నివేశంలో అద్భుతంగా నటించారని గుర్తుచేశారు. విజయలక్ష్మి ఆర్ట్స్ నిర్మించిన తొలి చిత్రంగా 'మొనగాడు' ప్రత్యేకతను సంతరించుకుందని తెలిపారు.తెలుగు సినీ పరిశ్రమలో శోభన్ బాబు తన సహజ నటనతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారని తెలుగు రాష్ట్రాల శోభన్ బాబు ఫ్యాన్స్ కరస్పాండెంట్ జె. త్రిమూర్తులు అన్నారు. 'మనుషులు మారాలి', 'బంగారు పంజరం', 'జీవన తరంగాలు', 'శారద', 'మంచి మనుషులు', 'చెల్లెలి కాపురం', 'బలిపీఠం', 'జీవనజ్యోతి', 'కార్తీకదీపం', 'గోరింటాకు', 'ఇల్లాలు', 'మహారాజు' తదితర చిత్రాలతో మూడు తరాల ప్రేక్షకులను అలరించారని పేర్కొన్నారు. కేవలం కుటుంబ కథా చిత్రాలకే పరిమితం కాలేదని గౌరవ అధ్యక్షులు చందు సుబ్బారావు అన్నారు. 'వీరాభిమన్యు'లో అభిమన్యుడిగా, 'సంపూర్ణ రామాయణం'లో శ్రీరాముడిగా, 'కురుక్షేత్రం'లో శ్రీకృష్ణుడిగా, 'సతీ అనసూయ'లో నారదుడిగా పౌరాణిక పాత్రల్లోనూ అద్భుతంగా నటించారని తెలిపారు. మాస్ హీరోగా కూడా శోభన్ బాబు తనదైన ముద్ర వేశారని చందు సుబ్బారావు అన్నారు. 'మానవుడు--దానవుడు', 'ఖైదీ బాబాయ్', 'కోడెనాగు', 'సోగ్గాడు', 'మొనగాడు', 'జేబుదొంగ', 'జూదగాడు' వంటి చిత్రాల్లో విభిన్నమైన పాత్రలు పోషించి ప్రేక్షకుల అభిమానాన్ని పొందారని పేర్కొన్నారు.శోభన్ బాబు తన నటనకు అనేక అవార్డులు అందుకున్నారని ప్రధాన కార్యదర్శి గోరకాల రామదాసు తెలిపారు. 1971, 1972, 1973 సంవత్సరాల్లో వరుసగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నంది అవార్డులు అందుకుని హ్యాట్రిక్ సాధించిన ఘనత ఆయనకు ఉందన్నారు. అలాగే 1974, 1975, 1976 సంవత్సరాల్లో వరుసగా ఫిలింఫేర్ అవార్డులు అందుకున్నారని పేర్కొన్నారు. 'మొనగాడు' చిత్రం 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా చిత్రానికి సంబంధించిన పలు ఆసక్తికరమైన విశేషాలతో ప్రత్యేక పుస్తకాన్ని జె. త్రిమూర్తులు రూపొందించారు. కార్యక్రమంలో ఆ పుస్తకాలను అభిమానులు, సినీ ప్రియులకు పంపిణీ చేశారు. శోభన్ బాబు అభిమానులు, సంఘం ప్రతినిధులు, సినీ ప్రేమికులు పాల్గొని ఆయన సినీ సేవలను స్మరించుకున్నారు.

# వరద బాధితులను తక్షణమే ఆదుకోవాలి




- పంటలు, ఇళ్లు కోల్పోయిన వారికి వెంటనే పరిహారం అందించాలి.
- అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి.
- కాంగ్రెస్ పార్టీ ఆదివాసీ రాష్ట్ర వైస్ చైర్మన్ వెంగడ నీలకంఠం.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, సెప్టెంబరు 25.**బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం కారణంగా భారీ వర్షాలు కురుస్తున్నాయని, రెండు మూడు రోజుల్లో వర్షాలు తగ్గుముఖం పట్టిన వాటి వల్ల పేదలు, రైతులు ఎదుర్కొనే ఆర్థిక నష్టం నెలల తరబడి వేధిస్తుందని, బాధితులకు ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ ఆదివాసీ విభాగం రాష్ట్ర వైస్ చైర్మన్ వెంగడ నీలకంఠం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.?ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాధితులకు ఆహారం, సురక్షిత తాగునీరు, మందులు తక్షణమే అందించాలనీ, ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రమాదంలో ఉన్న చిన్నారులు, వృద్ధులు, గర్భిణీలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. వరదల్లో ఇళ్లు, పంటలు, పశువులు కోల్పోయిన కుటుంబాలకు నష్టపరిహారాన్ని అందించాలన్నారు. పంట నష్టాన్ని క్షేత్రస్థాయిలో ప్రత్యేకంగా సర్వే చేయాలని, బాధితులకు నష్టపరిహారంతో పాటు, తిరిగి వ్యవసాయం ప్రారంభించడానికి విత్తనాలు, ఎరువులు ఉచితంగా లేదా సబ్సిడీపై పంపిణీ చేయాలన్నారు. దెబ్బతిన్న రోడ్లు, వంతెనలు, కల్వర్టులకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని, ప్రభావిత గ్రామాల్లో మంచినీటి క్లోరినేషన్, ముమ్మర పారిశుద్ధ్య చర్యలు చేపట్టి అంటువ్యాధులు వ్యాపించకుండా చూడాలని అన్నారు. అధికారులు కార్యాలయాలకే పరిమితం కాకుండా నేరుగా క్షేత్రస్థాయిలో పర్యటించి, బాధితుల కష్టాలను తెలుసుకుని తక్షణ పరిష్కార చర్యలు చేపట్టాలని వెంగడ నీలకంఠం డిమాండ్ చేశారు.

# సామూహిక వందేమాతరం గాన కార్యక్రమం 150 సంవత్సరాల వసంతాలు పూర్తి చేసుకున్న దినం




**హుకుంపేట పెన్ పవర్ సెప్టెంబర్ 25:**అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలం కేంద్రంలో విజ్ఞాన భారతి పాఠశాలలోని సామూహిక వందేమాతరం పండిత్ డయల్ ఉపాధ్యాయ జయంతిని పురస్కరించుకొని వందేమాతరం గీతం 150 సంవత్సరాలు వసంతాలు పూచేసుకున్న సందర్భంగా హుకుంపేట మండలంలో సామూహిక వందేమాతరం గానం గేయాన్ని రచించి 150 ఏళ్ల పూర్తి సందర్భంగా 25 /09 /2026 శుక్రవారం నాడు సామూహికంగా వందేమాతరం గీతాన్ని 1047మంది మూడు కేంద్రాలు విద్యార్థులతో మరియు పాఠశాల సిబ్బంది ఈ గేయం ని ఆలపించారు దాని ద్వారా పిల్లల్లో దేశభక్తి అనే ప్రేరణ కలుగుతుంది అని ప్రిన్సిపాల్ ఏ.శ్రీనివాస్ రావు విజ్ఞాన భారతిపాఠశాల ప్రిన్సిపల్ అప్పలకొండ అన్నారు ఈ యొక్క కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది కళాశాల సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# తుపాను ప్రభావం.. రైతులకు కన్నీటి కష్టం

పంటలు కొట్టుకుపోయి.. పెట్టుబడులు నష్టపోయిన వైనం



**గూడెం కొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 25:**అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలం దారకొండ, గుమ్మిరేవుల, దుప్పులవాడ గ్రామ పంచాయతీల పరిధిలో తుపాను ప్రభావంతో రైతుల ఆశలు ఆవిరయ్యాయి. గతంలో వర్షాలు లేక ఇబ్బందులు పడిన రైతులకు, అనంతరం కురిసిన వర్షాలతో పొలాల్లో వరి నాట్లు పచ్చగా కళకళలాడటంతో ఈ ఏడాది పంట దిగుబడి బాగుంటుందని ఆశలు పెట్టుకున్నారు.అయితే తుపాను ప్రభావంతో సుమారు ఐదు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు పంట పొలాల్లో గండ్లు ఏర్పడి, వరి నాట్లు నీటి ప్రవాహానికి కొట్టుకుపోయాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. పెట్టుబడులు కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేకపోవడంతో పాటు, పంట చేతికందకపోవడంతో కుటుంబ పోషణపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.భారీ వర్షాలకు కొన్ని గ్రామాల్లో మట్టి ఇళ్ల గోడలు కూలిపోవడంతో పలువురు బాధితులు బంధువుల ఇళ్లలో తలదాచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని గ్రామస్థులు తెలిపారు.తుపాను కారణంగా జరిగిన పంట, ఆస్తి నష్టాలను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, సమగ్రంగా అంచనా వేయాలని రైతులు కోరుతున్నారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తక్షణమే పరిహారం అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# భారీ వర్షానికి మృతి చెందిన మూగ జీవి

- ప్రభుత్వం ఆదుకోవాలన్న బాధితుడు హరిబాబు.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, సెప్టెంబరు 25.**మండలంలోని మాకవరం పంచాయతీ, లబడపుట్టు గ్రామంలో అరడికటియ హరిబాబు అనే రైతుకు చెందిన ఓ ఆవు భారీ వర్షానికి శుక్రవారం మృతి చెందింది. తాము పెంచుకున్న మూగ జీవి మృతి చెందటంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదన చెందారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కుటుంబం విజ్ఞప్తి చేశారు. జరిగిన ఘటనను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి ప్రభుత్వం నుండి వచ్చే సహాయం అందించుటకు కృషి చేస్తానని టిడిపి నాయకుడు చెండా బాపూజీ తెలిపారు.

# 99వ వార్డు కార్పొరేటర్ అభ్యర్థిగా అవకాశం కల్పించాలని టీడీపీ నాయకులు దరఖాస్తు



**గాజువాక:పెన్ పవర్,సెప్టెంబర్25** జీవీఎంసీ 99వ వార్డు కార్పొరేటర్ అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం కల్పించాలని కోరుతూ టీడీపీ సీనియర్ నాయకులు కళ్లేపల్లి శ్రీనివాస్ వర్మ, డీవీ అప్పారావు, బెల్లం కొండ రాజన్ రాజు, టీడీపీ యువ నాయకుడు గోకాడ భాస్కర్ గాజువాక టీడీపీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు , నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు దరఖాస్తు సమర్పించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తూ పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నమని తెలిపారు. 99వ వార్డు నుంచి కార్పొరేటర్ అభ్యర్థిగా అవకాశం కల్పిస్తే పార్టీ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ వార్డు అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు.పార్టీ అధిష్ఠానం వారి అభ్యర్థిత్వాన్ని పరిశీలించి అవకాశం కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమం లో జీవీఎంసీ 87 వార్డు టీడీపీ యూత్ అధ్యక్షుడు కర్రి కృష్ణ, వైస్ ప్రెసిడెంట్ సంద్రన రాజేష్,యూత్ సెక్రటరీ శ్రావణ్, డీవీ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు

# మాదకద్రవ్యాలపై యువత సమరం

**మాదకద్రవ్యాల నిర్మూలనలో యువత కీలక పాత్ర**

**డ్రగ్స్‌కు దూరంగా ఉంటేనే ఉజ్వల భవిష్యత్తు: సమాచార కమిషనర్ పి.ఎస్. నాయుడు**




**విశాఖ దక్షిణం, పెన్ పవర్, సెప్టెంబర్ 25 :** మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తి జీవితంతో పాటు కుటుంబం, సమాజం, దేశ భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార కమిషనర్ పి.ఎస్. నాయుడు అన్నా రు. మాదకద్రవ్యాల నిర్మూలనలో యువత కీలక పాత్ర పోషించాలని ఆయన పిలుపునిచ్చారు.ద్వారకానగర్ 5వ లైన్లోని ఫ్లైఓగ్ ఇన్‌స్టిట్యూ షన్‌లో నిర్వహించిన మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహనా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత దేశానికి అత్యంత విలు వైన సంపద అని, వారి శక్తి, ప్రతిభ, ఆలోచనా విధానం దేశ ప్రగతికి ఉపయోగపడాలని అన్నా రు.తాత్కాలిక ఆనందం కోసం మాదకద్రవ్యాల కు అలవాటు పడటం వల్ల విద్య, ఉద్యోగం, ఆరోగ్యం, కుటుంబ సంబంధాలు, సామాజిక గౌరవం వంటి అంశాలు దెబ్బతింటాయని పేర్కొ న్నారు. మాదకద్రవ్యాలకు 'నో' చెప్పడం వ్యక్తిగ త నిర్ణయం మాత్రమే కాదని, కుటుంబం, సమా జం, భవిష్యత్ తరాలను రక్షించే బాధ్యత అని అన్నారు.విద్యార్థులు, యువత చెడు స్నేహాలు, తప్పుడు ప్రచారాలు, సోషల్ మీడియా ప్రభా వాలు, ప్రయోగాత్మక ఆసక్తుల పట్ల అప్రమ త్తంగా ఉండాలని సూచించారు. తమ ప్రతిభను క్రీడలు, విద్య, విజ్ఞానం, సాంకేతికత, కళలు, సామాజిక సేవ వంటి సృజనాత్మక రంగాల వైపు మళ్లించాలని కోరారు.తల్లిదండ్రులు పిల్లలతో స్నేహపూర్వకంగా మెలిగి వారి సమస్యలను తెలుసుకోవాలని, అవసరమైన సందర్భాల్లో కౌన్సెలింగ్, వైద్య సహాయం అందించాలని సూచించారు. మాదకద్రవ్యాల నియంత్రణకు ప్రభుత్వ చర్యలతో పాటు యువత, తల్లిదండ్రు లు, విద్యాసంస్థలు, సమాజం కూడా బాధ్యతగా వ్యవహరించాలని పి.ఎస్. నాయుడు అన్నారు.

"డ్రగ్స్‌కు నో చెప్పండి.. జీవితానికి, ఆరోగ్యానికి, దేశ భవిష్యత్తుకు అవును చెప్పండి" అని విద్యా ర్థులకు పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థుల తో మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమం అనంతరం పి.ఎస్. నాయుడు ను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అర్జున్ ప్రేమ్‌జీ, స్వప్న, స్పెషల్ మెజిస్ట్రేట్ పైల సన్నిబాబు, హిమా హ్యూమాని టేరియన్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ డీవీడీ దాసు, ప్రశాంత్ బెహరా, కామేష్, ఆశ్రయ్, ఓం హేవ్ ఫ్రమ్ హౌస్ పౌడర్ స్నేహ, ఎన్. ఫరూక్, విశాఖపట్నం జిల్లా అదనపు ప్రభుత్వ న్యాయ వాది కన్నూరు అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

# విజ్ఞాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ టెక్నాలజీలో ఘనంగా ప్రపంచ ఫార్మసిస్ట్స్ డే వేడుకలు




**ఆరోగ్యవంతమైన భవిష్యత్తు కోసం ఫార్మసిస్టుల సాధికారత" అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు**

**కూర్మన్నపాలెం :పెన్ పవర్,సెప్టెంబర్25** విజ్ఞాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ టెక్నాలజీ అటానమస్ ఆధ్వర్యంలో, ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ , ఆంధ్రప్రదేశ్ స్టేట్ బ్రాంచ్ సహకారంతో ప్రపంచ ఫార్మసిస్ట్స్ డే సందర్భంగా ఆర్ ఎక్స్ 2 కే 26 పేరుతో రెండు రోజుల జాతీయ సదస్సును సెప్టెంబర్ 24, 25 తేదీలలో ఘనంగా నిర్వహించారు. ఆరోగ్యవంతమైన భవిష్యత్తు కోసం ఫార్మసిస్టుల సాధికారత అనే అంశంపై ఈ సదస్సు జరిగింది.ఈ కార్యక్రమానికి ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ మరియు కామన్వెల్త్ ఫార్మసిస్ట్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు డా. రావు వడ్లమూడి, అలాగే సౌదీ అరేబియాలోని రియాద్‌లోని ఫార్మాస్యూటికల్ ఇండస్ట్రీస్‌లో డైరెక్టర్ డా. కె. ఆదినారాయణ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా డా. రావు వడ్లమూడి మాట్లాడుతూ, ఆధునిక ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలో ఫార్మసిస్టుల పాత్ర రోజురోజుకూ మరింత విస్తరిస్తోందని అన్నారు. ఔషధాల సురక్షితమైన, సముచితమైన మరియు సమర్థవంతమైన వినియోగంలో ఫార్మసిస్టులు కీలక బాధ్యత వహించాల్సి ఉందని తెలిపారు. మారుతున్న వైద్యరంగ అవసరాలకు అనుగుణంగా ఫార్మసిస్టులు తమ జ్ఞానం, నైపుణ్యాలను నిరంతరం అభివృద్ధి చేసుకోవాలని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. సమాజానికి మెరుగైన ఆరోగ్య సేవలు అందించేందుకు ఫార్మసిస్టుల సాధికారత ఎంతో అవసరమని పేర్కొన్నారు.డా. కె. ఆదినారాయణ రెడ్డి మాట్లాడుతూ, ప్రపంచ ఫార్మాస్యూటికల్ మరియు హెల్త్‌కేర్ రంగాల్లో ఫార్మసిస్టులకు విస్తృతమైన అవకాశాలు ఉన్నాయని తెలిపారు. పరిశోధన, ఆవిష్కరణలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం మరియు పరిశ్రమ--విద్యాసంస్థల మధ్య సమన్వయం భవిష్యత్ ఫార్మసిస్టులను తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. విద్యార్థులు అంతర్జాతీయ దృక్పథాన్ని పెంపొందించుకోవడంతో పాటు ఆధునిక నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని పరిశోధన మరియు ఆవిష్కరణల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు.

ఈ కార్యక్రమానికి విజ్ఞాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ డా. వై. శ్రీనివాసరావు, విజ్ఞాన్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ చైర్మన్ డా. ఎల్. రాథయ్య, విజ్ఞాన్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ వైస్ చైర్మన్ మరియు పార్లమెంట్ సభ్యులు ఎల్. శ్రీకృష్ణ దేవరాయలు, విజ్ఞాన్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ సి ఈ ఓ ఎన్. శ్రీకాంత్ తదితరులు హాజరై కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు తమ సహకారం అందించారు.

రెండు రోజుల సదస్సులో ఓరల్ ప్రెజెంటేషన్స్, ఈ–పోస్టర్ ప్రెజెంటేషన్స్, ఫార్మా క్విజ్, డ్యాన్స్ కాంపిటీషన్ మరియు ఆన్–ది–స్పాట్ గేమ్స్ వంటి వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు ఈ కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొని తమ విద్యా ప్రతిభ, సృజనాత్మకత, కమ్యూనికేషన్ నైపుణ్యాలు మరియు ఇతర ప్రతిభను ప్రదర్శించారు. సదస్సు ముగింపు కార్యక్రమానికి ఆంధ్ర విశ్వవిద్యాలయం కాలేజ్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ రిటైర్డ్ ప్రొఫెసర్ ప్రొఫెసర్ పి. రాజేశ్వరరావు గౌరవ అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ పి. రాజేశ్వరరావు "ఆరోగ్యవంతమైన భవిష్యత్తు కోసం ఫార్మసిస్టుల సాధికారత" అనే అంశంపై ప్రసంగిస్తూ, ఆరోగ్య సంరక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో ఫార్మసిస్టుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఫార్మసిస్టులు వృత్తిపరమైన జ్ఞానం, నిరంతర అభ్యాసం, పరిశోధనా దృక్పథం మరియు నైతిక విలువలను పెంపొందించుకోవాలని సూచించారు. ఫార్మసీ మరియు ఆరోగ్యరంగంలో వస్తున్న ఆధునిక మార్పులకు అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.వాలెడిక్టరీ కార్యక్రమంలో భాగంగా సదస్సులో నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రముఖ అతిథులు మరియు ఇతర విశిష్ట అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేసి అభినందించారు. వివిధ విద్యా, సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు కనబరిచిన ప్రతిభ, ఉత్సాహం మరియు చురుకైన భాగస్వామ్యాన్ని ఈ సందర్భంగా ప్రశంసించారు.ఈ రెండు రోజుల జాతీయ సదస్సులో సుమారు 1000 మంది విద్యార్థులు, అధ్యాపకులు మరియు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రతినిధులు పాల్గొన్నారు. కళాశాల అధ్యాపకులు మరియు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.జ్ఞానం, పరిశోధన, ఆవిష్కరణలు, రోగుల పట్ల బాధ్యత మరియు వృత్తిపరమైన నైపుణ్యాల ద్వారా ఆరోగ్యవంతమైన భవిష్యత్తును నిర్మించడంలో ఫార్మసిస్టుల పాత్ర ఎంతో కీలకమనే సందేశంతో రెండు రోజుల జాతీయ సదస్సు విజయవంతంగా ముగిసింది.

# ఎంసీఏ యూత్ ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన

**గాజువాక:పెన్ పవర్,సెప్టెంబర్ 25** జీవీఎంసీ 66వ వార్డులో శ్రీ వరసిద్ధి వినాయక చవితి మహోత్సవం సందర్భంగా అజిమబాదు నందు ఎంసీఏ యూత్ ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు . ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 66 వార్డు తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ మాజీ కార్పొరేటర్ మహమ్మద్ రఫీ పాల్గొని ప్రసాదం పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో ఎంసీఏ యూత్ సభ్యులు వెంకటేష్, కిరణ్ ,నాజిల్, మాధవ్, అజయ్, మౌలాలి, శ్రీను, ధీరజ్, విశాల్, యోనా, మొహిద్దిన్ ,హర్ష ,కార్తీక్, గౌస్, నదీమ్ పాల్గొన్నారు . అన్న సమారాధన కార్యక్రమానికి వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.



## మెగా రికవరీ మేళాలో విస్తృత నేర అవగాహన కార్యక్రమం

**మేము పోగొట్టుకున్నాం... మీరు మాత్రం పోగొట్టుకోవద్దు - ముందస్తుగా అప్రమత్తంగా ఉండండి**



**గాజువాక:పెన్ పవర్,సెప్టెంబర్25**
మెగా రికవరీ మేళాకు హాజరైన బాధితులు, ప్రజలకు నేరాల నివారణ, సైబర్ మోసాలపై విశాఖపట్నం నగర పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు.విశాఖపట్నం నగర పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చీ, డీసీపీ లతా మాధురి, ఏడీసీపీ రమ్య, నేర విభాగం ఏసీపీ వెంకట్రావు ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడుతూ నేరం జరిగిన తర్వాత ఆస్తులు పోగొట్టుకున్నామని బాధపడటం కంటే, నేరం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ఎంతో ముఖ్యమని ప్రజలకు వివరించారు.ప్రతి ఇంటి వద్ద, వ్యాపార సంస్థల వద్ద నిఘా కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నిఘా కెమెరాల వల్ల నేరాలను అడ్డుకోవడంతో పాటు, నేరం జరిగినప్పుడు నిందితులను గుర్తించేందుకు పోలీసులకు కీలక ఆధారాలు లభిస్తాయని తెలిపారు.ఒక నిఘా కెమెరా లక్ష కళ్లతో సమానం అనే సందేశంతో నిఘా కెమెరాల ప్రాధాన్యతను వివరించారు. బయటకు వెళ్లే సమయంలో అనవసర ఖర్చులు తగ్గించుకొని, ఇళ్ల భద్రత కోసం తక్కువ వ్యయంతో నిఘా కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. జేబు దొంగతనాలు, సెల్‌ఫోన్ దొంగతనాలు, గొలుసు దొంగతనాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. పగలు, రాత్రి వేళల్లో ఇళ్లలో దొంగతనాలు జరగకుండా పరిసర ప్రాంతాల్లో తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఆటోలు, ఇతర ప్రజా రవాణా వాహనాల్లో ప్రయాణించే సమయంలో బ్యాగులు, సెల్‌ఫోన్లు, విలువైన వస్తువుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.ప్రజల దృష్టిని మరల్చి దొంగతనాలకు పాల్పడే వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అపరిచిత వ్యక్తులను సులభంగా నమ్మవద్దని హెచ్చరించారు.నకిలీ డిజిటల్ చెల్లింపు సందేశాలు, నకిలీ చెల్లింపు దరఖాస్తుల ద్వారా జరిగే మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. డిజిటల్ లావాదేవీల సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాల బారిన పడకుండా ఒకసారి ఉపయోగించే రహస్య సంకేతాలు, వ్యక్తిగత గుర్తింపు సంఖ్యలు, రహస్య సంకేతపదాలు, బ్యాంకు ఖాతా వివరాలు, ఏకీకృత చెల్లింపు వివరాలను అపరిచితులతో పంచుకోవద్దని పోలీసులు సూచించారు.మెగా రికవరీ మేళాకు హాజరైన సుమారు 500 మంది బాధితులు గతంలో బంగారం, విలువైన వస్తువులు, సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఇకపై ఇటువంటి నష్టాలు, మానసిక వేదనకు గురికాకుండా ముందస్తు నేర నివారణ చర్యలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని పోలీస్ అధికారులు సూచించారు.మేము పోగొట్టుకున్నాం... మీరు మాత్రం పోగొట్టుకోవద్దు. ముందస్తుగా అప్రమత్తంగా ఉండండి అనే సందేశంతో బాధితులు, ప్రజలకు పోలీసులు పిలుపునిచ్చారుప్రతి ఇంటి ముందు, ప్రతి వ్యాపార సంస్థ వద్ద నిఘా కెమెరాలు ఏర్పాటు చేసుకొని పరిసర ప్రాంతాలపై నిరంతరం నిఘా ఉండేలా చూసుకోవాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.నిఘా కెమెరాలు ఏర్పాటు చేయడం వల్ల నేరాలకు పాల్పడే వ్యక్తుల్లో భయం ఏర్పడటంతో పాటు, నేరం జరిగిన సందర్భంలో పోలీసుల దర్యాప్తునకు కీలక ఆధారాలు లభిస్తాయని తెలిపారు.ప్రజలు అప్రమత్తంగా ఉంటూ పోలీసుల నేర నివారణ చర్యలకు సహకరించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.సంప్రదించాల్సిన ఫోన్: 9490617922,అత్యవసర పరిస్థితుల్లో: 112 పోలీస్ లను సంప్రదించాలని కోరారు . నేరం జరిగిన తర్వాత స్పందించడం కంటే నేరం జరగకుండా ముందస్తుగా అప్రమత్తంగా ఉండటమే మేలు అన్నారు .

## సమ్మె నేపథ్యంలో ఆదివారం బ్యాంకులు ఓపెన్

**పెన్షన్‌దారులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు**




**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు, పెన్ పవర్, సెప్టెంబర్ 25:**బ్యాంకర్ల సంఘాలు సెప్టెంబర్ 28 నుంచి 30వ తేదీ వరకు సమ్మెకు పిలుపునిచ్చిన నేపథ్యంలో ఖాతాదారులకు, ముఖ్యంగా పెన్షన్‌దారులకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఆదివారం బ్యాంకు శాఖలను తెరిచి ఉంచనున్నట్లు అల్లూరి సీతారామరాజు జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీ మాతు నాయుడు తెలిపారు.పెన్షన్‌దారులకు సకాలంలో నగదు అందేలా ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అక్టోబర్ 1వ తేదీ గురువారం ఉదయం బ్యాంకుల నుంచి పెన్షన్ మొత్తాలను ఉపసంహరించుకుని, అదే రోజు మధ్యాహ్నం పెన్షన్‌దారులకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.కావున జిల్లాలోని పెన్షన్‌దారులు ఈ మార్పును గమనించి అక్టోబర్ 1వ తేదీ మధ్యాహ్నం సంబంధిత పెన్షన్ పంపిణీ కేంద్రాలకు హాజరై తమ పెన్షన్ మొత్తాన్ని స్వీకరించాలని లీడ్ బ్యాంక్ కార్యాలయం విజ్ఞప్తి చేసింది.పెన్షన్ పంపిణీలో ఎటువంటి అంతరాయం కలగకుండా సంబంధిత అధికారులు అవసరమైన అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించినట్లు లీడ్ బ్యాంక్ మేనేజర్ తెలిపారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com